



డీఎస్సీ-25 జిల్లా ర్యాంకర్లు వీరే

శుక్రవారం రాత్రి ఫలితాలు విడుదల

మచిలీపట్నం/విజయవాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : టీచర్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల కలలు నెరవేరాయి. మెరిట్ జాబితాలను శుక్రవారం రాత్రి విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీఎస్సీ 2025ను ప్రకటించింది. కృష్ణాజిల్లాలో 1,208 పోస్టులను భర్తీ చేయనుండగా, శుక్రవారం రాత్రి వెలువడిన ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ విభాగంలో అనగాని శ్రీరామ్ (బీసీ-బీ) 88.80 స్కోరుతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాడు. పోలుకొండ గోకుల్‌సాయి (ఎస్సీ గ్రేడ్-3) 84.33 స్కోరుతో ద్వితీయ, షేక్ ఫయాజుద్దీన్ (బీసీ-ఈ) 84.10 స్కోరుతో తృతీయ, కాగిత తేజస్విని (బీసీ-బీ) 83.67 స్కోరుతో నాల్గో స్థానంలో నిలిచారు.

మిగతా 6లో..

గ్రేడ్-2 మున్సిపాలిటీగా ఉయ్యూరు

ఉయ్యూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగర పంచాయతీని గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్‌కుమార్ శుక్రవారం జీవో విడుదల చేశారు. మేజర్ పంచాయతీగా ఉన్న ఉయ్యూరు 2011లో నగర పంచాయతీగా మారింది. మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కావడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు పెరగనున్నాయి.





వరలక్ష్మీ నమోస్తుతే..

ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో చివరి శ్రావణ శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా జరిగాయి. వేలమంది భక్తులు దర్శనానికి తరలివచ్చారు. క్యూలైన్లు, ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

8

మడత పెట్టేశారు..!


మడ అడవులపై అక్రమార్కుల కన్ను

15 వేల ఎకరాల్లో 5 వేల ఎకరాలు హాంఫట్

పెడన, బంటుమిల్లి, బందరు, కృత్తివెన్ను మండలాల్లో కొనసాగుతున్న ఆక్రమణలు

- చెట్లను నరికేసి.. రొయ్యల చెరువులుగా మార్చేసి..
- గత పదేళ్లలో ఆక్రమణలు.. శాటిలైట్ చిత్రాలే సాక్ష్యం
- రాజకీయ నేతలు, గ్రామాల్లోని కొందరి స్వార్థం వల్లే..
- తుఫాన్లు, సునామీల నుంచి కాపాడే మడ అడవులు
- అంతరించిపోతే ప్రమాదమంటున్న పర్యావరణవేత్తలు





మడ అడవుల్లో అక్రమ రొయ్యల చెరువులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/మచిలీపట్నం) : కృష్ణాజిల్లాలోని పెడన, బంటుమిల్లి, బందరు, కృత్తివెన్ను మండలాల పరిధిలో బంగాళాఖాతం వెంబడి 15 వేల ఎకరాల విస్తీర్ణంలో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. బంటుమిల్లి మండలం నారాయణపురం, మణిమేశ్వరం, పెడన మండలం లజ్జబండ కాల్వ రెండువైపులా, జింజేరు, బందరు మండలంలోని గిలకలదిండి, పెదపట్నం, కానూరు, సత్రవపాలెం గ్రామాలు, కృత్తివెన్ను మండలం ఇంతేరు, పీతలావ, కృత్తివెన్ను, పల్లెపాలెం, నిడమర్రు, ఓర్లగొందితిప్ప గ్రామాల్లో మడ అడవులు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో అక్రమార్కులు, ఆక్రమణదారులు ఏకమై చెట్లను నరికేస్తున్నారు. రాజకీయ నాయకుల ప్రేరేపిత ఆక్రమణలు, అధికారుల అవినీతి, తీరప్రాంతాల్లోని కొందరి స్వార్థం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతోంది. పంచాయతీల్లో చీకటి తీర్మానాలు చేసుకుని 5 నుంచి 10 ఎకరాల వరకు పెగ్ మార్కింగ్ చేసుకుని రాత్రికి రాత్రే నరికివేస్తున్నారు. ఆ తర్వాత రొయ్యల చెరువులు తవ్వేస్తున్నారు. రొయ్యలు, పీతలు సాగు చేస్తున్నారు.

అందరి బాధ్యత

సముద్ర తీర ప్రాంతాలకు ప్రకృతి ప్రసాదించిన వరం మడ అడవులు. వీటిని సంరక్షించుకోవటం అధికార యంత్రాంగంతో పాటు ప్రజలది కూడా. ఈ అడవులు తుఫాన్లు, సునామీల నుంచి తీరప్రాంత గ్రామాలను కాపాడతాయి. మడచెట్లు నీటిని శుభ్రపరుస్తాయి. ఎగువ ప్రాంతాల డ్రెయిన్ల ద్వారా సముద్రంలో కలిసే నీటిని శుభ్రపరుస్తాయి.

వైసీపీ హయాం నుంచి..

వైసీపీ హయాంలో 2 వేల ఎకరాల వరకు మడచెట్లను నరికేశారు. రాజకీయ ప్రేరేపిత ఆక్రమణలను చూసి తీరప్రాంత గ్రామాల్లోని కొందరి కన్ను కూడా పడింది. మడచెట్ల నరికివేతను ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. కొద్దికాలం రొయ్యల సాగు చేశాక రెవెన్యూ అధికారుల వద్ద పట్టాలు తెచ్చుకుంటున్నారు. ఈ పట్టాలను ఆధారంగా చేసుకుని ఇతరులకు లీజులకు

మిగతా 6లో..

> సముద్ర తీర ప్రాంతాలకు రక్షణ కవచంగా ఉండే మడచెట్లను నరికేస్తున్నారు. పెడన, బంటుమిల్లి, బందరు, కృత్తివెన్ను మండలాల పరిధిలోని 15 వేల ఎకరాల మడ అటవీ విస్తీర్ణం నేడు 10 వేల ఎకరాలకు పడిపోవడమే ఇందుకు నిదర్శనం. ప్రకృతి ప్రసాదించిన చెట్లను నరికేస్తూ, భూములను ఆక్రమిస్తూ, రొయ్యల చెరువులను తవ్వేస్తూ, అనక అమ్మేస్తున్నా.. అధికార యంత్రాంగం పట్టించుకున్న దాఖలాలు లేవు.

> మూడు నెలలు కూడా నిండని తన చిన్నారి కన్నయ్యకు కృష్ణుడి వేషం వేసి మురిసిపోయింది ఆ కన్నతల్లి. అల్లరి కిట్టయ్యలా అంతకంతకూ ఎదిగిపోవాలని ఎన్నో కలలుకంది. సరిగ్గా వారం కిందట కృష్ణాష్టమి నాడు వేడుకలు చేసుకున్న ఆ ఇంట్లో నేడు ఆర్తనాదాలు మిన్నంటాయి. మూడు నెలల పసికందు పొత్తిళ్లలోనే కన్నుమూయగా, కంటికిరెప్పలా కాపాడుకున్న ఆ తల్లి తనయుడి వెంటే సాగిపోయింది. చూపరులకు కంటతడి పెట్టించిన ఈ హృదయ విదారకమైన రోడ్డు ప్రమాదం శుక్రవారం కంచికచర్ల మండలం కీసర టోల్‌గేట్ వద్ద జరిగింది.

కన్నయ్య వెంటే కన్నతల్లి



కీసర టోల్‌గేట్ వద్ద రోడ్డు ప్రమాదం

మూడు నెలల పసికందు సహా తల్లి మృతి

- బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి ఢీకొన్న లారీ
- పెద్దమ్మ ఇంట్లో నిద్రచేయడానికి వెళ్తూ శాశ్వత నిద్రలోకి..
- హృదయవిదారకంగా విలపించిన బంధువులు



కృష్ణుడి అలంకరణలో మూడు నెలల అద్విక్, ఆసుపత్రిలో మరణించిన తల్లి చైతన్య

కంచికచర్ల/రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడకు చెందిన నవీన్, చైతన్యకు 2024లో వివాహమైంది. నవీన్ ఆటోడ్రైవర్. వీరిద్దరికీ మూడు నెలల కిందట బాబు జన్మించాడు. అద్విక్ అని నామకరణం చేశారు. తల్లి చైతన్య తన మూడు నెలల అద్విక్‌తో కానూరులోని తల్లి మరియమ్మ ఇంట్లో ఉంటోంది. గత శనివారం కృష్ణాష్టమి సందర్భంగా బాబును కృష్ణుడిగా అలంకరించి మురిసిపోయింది. బాబుకు మూడో నెల రావటంతో కంచికచర్ల మండలం కీసర గ్రామంలో ఉంటున్న పెద్దమ్మ రేణుక ఇంట్లో ఒకరోజు నిద్ర చేయాలనుకున్నారు. శుక్రవారం ఉదయం కానూరు నుంచి తల్లి మరియమ్మ, అద్విక్‌తో కలిసి చైతన్య ఆర్టీసీ బస్సులో బయల్దేరింది. బస్సు కీసర శివారుకు చేరుకోగానే మరియమ్మ తన అక్క రేణుకకు ఫోన్ చేసి.. చైతన్యతో పాటు బాబును తీసుకెళ్లడానికి ఏదైనా బండి పంపమని అడిగింది. తన ఇంటి సమీపంలో ఉన్న శ్రీరామ్ అనే

మిగతా 6లో..

ఇదేం ఎంపిక ఆచార్యా..!

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో ఇష్టారాజ్యం

- జిల్లాస్థాయి ఇంటర్వ్యూల్లో ఇద్దరు టీచర్ల ఎంపిక
- రాష్ట్రస్థాయి ఇంటర్వ్యూకు హాజరైన మరొకరు
- ఆశ్చర్యపోయిన మిగతా ఇద్దరు
- పారదర్శకతకు చెల్లుచీటి.. ఉపాధ్యాయుల్లో చర్చ

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం) : జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక వివాదాస్పదమవుతోంది. గతంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యేందుకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉండేది. ఈ ఏడాది పారదర్శకత ఉండేలా ఇంటర్వ్యూలు నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. ఏమైనా తేడాలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించింది. ఇదిలా ఉండగా, విద్యాశాఖ కార్యాలయంలోని అధికారులు నిబంధనలను పక్కనపెట్టి తమ

మిగతా 6లో..

ముడా చైర్మన్ రాజీనామా

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం వల్లే..



మట్టా ప్రసాద్

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ముడా చైర్మన్ పదవికి మట్టా ప్రసాద్ శుక్రవారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని కలెక్టర్ బాలాజీకి అందజేశారు. 2024, నవంబరు 20న మట్టా ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. 9 నెలల పాటు పదవిలో ఉన్నారు. ఒకే నాయకుడికి రెండు పదవులు ఉండకూడదన్న నిబంధనల మేరకు మట్టా ప్రసాద్ ముడా చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ప్రసాద్‌ను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అధిష్ఠానం నియమించింది. ఫలితంగానే ఆయన రాజీనామా తప్పలేదు. ఈయన పదవి మరో రెండు నెలల్లో ముగియనుంది. గతంలో ముడా చైర్మన్ పదవిని కొందరు టీడీపీ నాయకులు ఆశించి భంగపడ్డారు. ఇలా భంగపడిన వారిలో ఇప్పుడు మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

ఉపాధి ఉఫ్..

భారీగా బయటపడిన అవకతవకలు

తోట్లవల్లూరు సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడి

రూ.25 లక్షల వరకు ఉండే అవకాశం



తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజా వేదికపై సమీక్ష

తోట్లవల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పంటకాల్వల తవ్వకాల్లో వందల మీటర్ల తేడా, ఎంబుక్ కంటే అధికంగా చెల్లింపులు, కూలీల వేలి ముద్రలు లేకుండా డబ్బు చెల్లించడం, మృతుల ఖాతాల్లో డబ్బు జమ చేయడం.. ఇలా అనేక అవకతవకలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెలుగు చూశాయి. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద రూ.7.41 కోట్లతో చేసిన 845 పనులకు సంబంధించి శుక్రవారం తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలస్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డ్వామా పీడీ శివప్రసాద్ 16 గ్రామాల్లోని పనులపై సమీక్షించారు. సోషల్ ఆడిట్ సిబ్బంది రూపొందించిన నివేదికలను ప్రజా వేదికపై వెల్లడి చేశారు.

ఆశ్చర్యపోయే అక్రమాలు

ప్రతి గ్రామంలో పంటకాల్వలు, బోదెల్లో మట్టి తవ్వకం పనుల్లో భారీ అక్రమాలు వెలుగుచూశాయి. కొన్ని గ్రామాల్లో అర కిలోమీటరు, 900 మీటర్లు కూడా తవ్వకాలు జరపకుండా డబ్బు కూలీలకు చెల్లించినట్లు

మిగతా 6లో..

యూరియా కష్టాలు

జిల్లా రైతులను వెంటాడుతున్న సమస్య

- సరిపడా సరుకు వస్తున్నా కొరత
- పక్కదారి పట్టిస్తున్న కొందరు పెద్దలు
- కాగితాలపైనే సర్దుబాటు లెక్కలు
- గంటల తరబడి క్యూల్లో అన్నదాతలు
- పెడన మండలం నందమూరులో తోపులాట

> యూరియా కొరత తారస్థాయికి చేరింది. కొందరు పెద్దలు మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ అధికారులతో కుమ్మక్కై యూరియా, కాంప్లెక్స్ ఎరువులను మాయంచేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు కాగితాలపై లెక్కలు చూపిస్తూ కొరత లేదని కవర్ చేస్తుండగా, సరిపడా యూరియా దొరక్క రైతులు పీఏసీఎస్‌ల వద్ద గంటలకొద్దీ క్యూల్లో నిలబడుతున్నారు.



పెడన మండలం నందమూరులో యూరియా కోసం క్యూలో రైతులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు జిల్లా అవసరాలకు సరిపడినంత యూరియా వచ్చినా, రైతులకు మాత్రం అందుబాటులో లేదు. యూరియా కోసం పీఏసీఎస్‌లు, వ్యాపారులు ఇండెంట్ పెట్టినా ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. కొందరు పెద్దమనుషుల ముసుగులో ముఠాలుగా ఏర్పడి బ్లాక్‌మార్కెట్ తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. యూరియా,

మిగతా 6లో..

దుకాణాలకు 50 కట్టల చొప్పున సరి

జిల్లాలోని ఎరువుల దుకాణ యజమానులకు గురువారం 50 కట్టల చొప్పున యూరియా ఇచ్చారు. దుకాణాలకు యూరియా వచ్చిందనే సమాచారంతో రైతులు రాగా, 10 నిమిషాల వ్యవధిలోనే విక్రయాలు పూర్తైపోయాయి. కాంప్లెక్స్ ఎరువులను కూడా జిల్లాలోని పలు ప్రాంతాల్లో అందుబాటులో ఉంచడం లేదని దుకాణ యజమానులు చెబుతున్నారు. కాంప్లెక్స్ ఎరువులు కావాలంటే మరికొన్ని ఉత్పత్తులు కొనాలని సాకులు చెప్పి ఒత్తిడి తెస్తున్నారంటున్నారు.



మృతుడు విఘ్నేశ్వరరావు(ఫైల్)

తాగుబోతు చేష్టలు భరించలేక... కుమారుడిని చంపిన తండ్రి

- సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు

8

16.5 అడుగులకు వరద నీటిమట్టం

- ప్రమాదకరంగా పులిగడ్డ ఆక్విడెక్ట్

6



ఆక్విడెక్ట్ వద్ద వరద ప్రవాహం

16.5 అడుగులకు వరద నీటి మట్టం

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదలవుతున్న వరద కారణంగా ప్రస్తుతం పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద 16.5 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. ప్రస్తుతం వరద పరిస్థితి ఇలానే ఉంటే శుక్రవారం అమావాస్య సందర్భంగా పోటు వచ్చే అవకాశం ఉండటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరద నీటిలో బీరతోటలు

మండల పరిధిలోని పాత ఎడ్లంక భూముల్లో బీర పంట వేసిన రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారు. ఈ ప్రాంతంలో మెట్టభూముల్లో రైతన్నలు ఎంతో ఆశతో బీరపంట వేశారు. అయితే కృష్ణానదికి సంభవించిన వరదల కారణంగా పంట ముంపునకు గురికావటంతో పంట చేతికొస్తుందన్న ఆశ పెట్టుకున్న రైతన్నలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన బీరతోటల రైతులకు పరిహారం చెల్లించాలని పలువురు రైతులు కోరుతున్నారు.



నిరసన తెలియజేస్తున్న ఎడ్లంక గ్రామస్థులు

పాత ఎడ్లంకను పరిరక్షించండి

» న్యాయం చేయాలని గ్రామస్థుల నిరసన

అవనిగడ్డ రూరల్: తమకు న్యాయం చేయాలని పాత ఎడ్లంక వాసులు నిరసన చేపట్టారు. కృష్ణానది గర్భంలోని గ్రామం తరచూ వరదలకు గురికావటంతో ఇళ్ల స్థలాలు సైతం కృష్ణానది గర్భంలో కలిసిపోతుండటంతో మనుగడ కష్టసాధ్యవుతుందని, అయినప్పటికీ అటు అధికారులు గానీ, ఇటు పాలకులు గానీ స్పందించకపోవటంతో తమ బతుకులు ఇలాగే తెల్లారిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వరదలు సంభవించిన సమయంలో కట్టుబట్టలతో ఉంటున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో గ్రామాన్ని పరిశీలించటానికి చర్యలు తీసుకుంటామని పాలకులు హామీలు ఇస్తున్నా వాస్తవానికి ఏ కార్యక్రమం చేపట్టకపోవటం ఆవేదన కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పాత ఎడ్లంక గ్రామ పరిరక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.



నాగాయలంక రేవులో వరద పరిస్థితి

నిలకడగా కృష్ణమ్మ

నాగాయలంక : ప్రకాశం బ్యారేజీ నుంచి వరద విడుదల కాస్త తగ్గుముఖ పట్టడంతో శుక్రవారం నాగాయలంక రేవులో వరద ప్రవాహం నిలకడగా ఉంది. దీంతో తీర ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరద ఉధృతికి నాగాయలంకలోని శ్రీరామపాదక్షేత్రంలో రామలింగేశ్వరస్వామి ఆలయం జలదిగ్బంధనంలోనే ఉంది.



ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్థులు

లభ్యం కాని పీహెచ్‌సీ ఆయా ఆచూకీ

» బంధువులు, గ్రామస్థుల ఆందోళన

» సమగ్రంగా విచారణ జరిపిస్తాం: డీఎంఅండ్‌హెచ్‌వో



విచారణ చేస్తున్న జిల్లా వైద్యాధికారిణి సుహాసిని

జి.కొండూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జి.కొండూరు పీహెచ్‌సీలో యూడీసీ వేధింపుల వల్ల గురువారం ఉదయం డ్యూటీ నుంచి ఇంటికి వెళ్లకుండా అదృశ్యమైన ఆయా మందా చిరంజీవి ఆచూకీ శుక్రవారం కూడా లభ్యం కాలేదు. రెండో రోజు ఆసుపత్రి ఎదుట కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారిణి సుహాసిని ఆసుపత్రికి రావడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం ఆయా కుటుంబసభ్యుల నుంచి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు స్వీకరించారు. యూడీసీ శ్రీనివాసరావును సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని చిరంజీవి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. రెండురోజుల నుంచి మైలవరం, జి.కొండూరు, విజయవాడ తదితర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని ఆయా కోసం విస్తృతంగా గాలిస్తున్నామని ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ వివరించారు. ఎంపీపీ వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ సంఘీభావం తెలిపారు. సమగ్రంగా విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో తెలిపారు.

మడత పెట్టేశారు..!

(5వ పేజీ తరువాయి)

ఇస్తున్నారు. ఎకరం రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు విక్రయిస్తున్నారు. అలాగే, రొయ్యల సాగులో నీటిని దిగువకు వదిలినప్పుడు అందులోని రసాయన క్రిమిసంహారక మందులు అటవీ ప్రాంతంలోకి చేరి మొక్కలు ఎండిపోతున్నాయి. చెట్ల ఎదుగుదల గణనీయంగా తగ్గిపోతోంది.

గూగుల్ ఎర్త్‌లో సాక్ష్యాలు

గూగుల్ ఎర్త్‌లో శాటిలైట్ చిత్రాలను పరిశీలిస్తే.. గత పదేళ్లలో మడచెట్ల నరికివేత ఎంత భారీగా జరిగిందో తెలుస్తుంది. 2000, 2020, 2025 శాటిలైట్ చిత్రాలను పరిశీలిస్తే తేడా అర్థమవుతుంది. 1995-2000 వరకు పచ్చగా ఉన్న చెట్ల స్థానంలో 2020 నాటికి రొయ్యల చెరువులు కనిపిస్తున్నాయి. 2025 చిత్రాలను పరిశీలిస్తే.. రొయ్యల చెరువులే కనిపిస్తాయి.

భౌ.. బోయ్!

» వీధుల్లో వెంటపడి పీకేస్తున్నాయి..

» ఆందోళనకరంగా పెరుగుతున్న కుక్కకాట్లు

» ఆగస్టులో రికార్డు స్థాయిలో 371 మంది బాధితులు

» ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా లక్షకు పైగా గ్రామసింహాలు

» పెరుగుతున్న వీధి కుక్కలతో ప్రాణాలు పోతున్నాయ్

» - నియంత్రణపై కార్యాచరణ ప్రణాళిక ఏదీ..



(ఆంధ్రజ్యోతి,మధురానగర్/సింగ్‌నగర్/ప్రభుత్వాసుపత్రి)

ఇంటి వద్ద ఒంటరిగా ఆడుకుంటున్న 14నెలల బాలుడిని వీధికుక్కలు వెంటాడి వేటాడి చంపేసాయి.. ఈ ఘటన గతేడాది పెనుగంచిప్రోలులో సంచలనం కలిగించింది. అలాగే కంచికచర్లలో కుక్కల దాడికి ఓ బాలుడు బలయ్యాడు. సాయంత్రం పాఠశాల నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళుతున్న బాలికలపై వీధికుక్కలు దాడి చేసిన ఘటన భవానీపురంలో, ఇబ్రహీంపట్నం గుంటుపల్లిలో ఇటీవల జరిగాయి. ఈనెల 11న మధురానగర్‌లో సైకిల్‌పై వెళుతున్న బాలుడిని కుక్కలు వెంటపడి కరవబోగా స్థానికులు అడ్డుకోవటంతో ప్రమాదం తప్పింది.

● కుక్క.. విశ్వాసం గల జంతువు.. అందుకే ధనవంతుల నుంచి నిరుపేదల వరకు ప్రతి ఒక్కరూ కుక్కను ఇంట్లో కుటుంబసభ్యులతో సమానంగా పెంచుకుంటారు. వాటికోసం ఎంత ఖర్చుకైనా వెనుకాడరు. మరికొందరు వీధికుక్కలపై మమకారంతో ఎక్కడికక్కడ రోడ్లపైనే వాటికి ఆహారం పెడుతుంటారు. పెరుగుతున్న జనాభాతో పాటు కుక్కల సంతతి విపరీతంగా పెరిగి ప్రజల ప్రాణాలకే సంకటంగా మారింది. పసిపిల్లల నుంచి పెద్దలు, వృద్ధులను రోడ్లపై వెంటాడి ప్రాణాలు తీసేస్తున్నాయి. జిల్లాలో ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న కుక్కకాటు బాధితులే దీనికి సాక్ష్యం.

ఆందోళనకరంగా బాధితుల సంఖ్య

వీధికుక్కల సమస్యను తీవ్రంగా భావించిన సర్వోన్నత న్యాయస్థానం స్పందించి సుమోటాగా కేసులు నమోదుచేసి అధికార యంత్రాంగాలకు తలంటుతున్నా ఎవరికీ పట్టడం లేదు. కుక్కల నుంచి ప్రజలను కాపాడాలని తీర్పులు ఇస్తున్నా.. ఆచరణకు మాత్రం రావడంలేదు. సోషల్ మీడియాలో ప్రతి రోజు ఎక్కడో ఒకచోట పిల్లలపై కుక్కల గుంపు చేస్తున్న దాడులకు సంబంధించి సీసీ కెమెరా దృశ్యాలు చూస్తూనే ఉన్నాం.. ఎన్టీఆర్ జిల్లాలో కుక్కకాటు బాధితుల సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతోంది. ప్రభుత్వాసుపత్రిలో కేసులు పరిశీలిస్తే ఆగస్టు నెలలో ఇప్పటికే 371 రికార్డు స్థాయిలో కేసులు నమోదయ్యాయి. నానాటికీ కుక్కల సంఖ్య కూడా పెరిగిపో

కుక్కకాటు బాధితులు ఇలా..	
సంవత్సరం	కేసులు
2023	7923
2024	9670
2025 జూలై వరకు	4847
2025 ఆగస్టు నెలలో	371

● విజయవాడ నగరంలో గత ఏడాది 30వేల వీధి కుక్కలు ఉన్నాయని అధికారులు లెక్కలు వేశారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఈ సంఖ్య లక్షకు పైగానే ఉండొచ్చని అంచనా. జిల్లాలో వీధి కుక్కలు పెరగకుండా తీసుకుంటున్న చర్యలు ఏ మాత్రం ఫలితం ఇవ్వడం లేదు.

జీవో ఇచ్చినా.. పట్టించుకోరు..

వీధికుక్కల నియంత్రణకు సంబంధించి మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి జీవో ఇచ్చారు. మునిసిపల్, కార్పొరేషన్లలో కమిషనర్, చైర్‌పర్సన్, ఆరోగ్యశాఖ నుంచి ఒకరు, జంతుసంరక్షణ విభాగం నుంచి సర్జన్‌తో కలిసి కమిటీ ఏర్పడాలి. పంచాయతీల్లో సర్పంచ్ చైర్‌పర్సన్‌గా ఉంటాడు. ఈ కమిటీ వీధికుక్కల నియంత్రణలో భాగంగా వాటిని పట్టుకోవడం, తరలించడం, సురక్షిత పద్ధతిలో ఆపరేషన్‌లు, ప్రజల్లో అవగాహన కల్పించడం, టోల్ ఫ్రీ నెంబర్, వాట్సప్ నెంబరు బహిరంగప్రదేశాల్లో కనబడేలా ప్రచారం చేయాలి.

● వీధుల్లో ఇళ్ల ముందు యజమానులు పెడుతున్న చెత్త డబ్బాల్లో ఆహారం తింటూ.. రాత్రి వేళ మిగిలిపోయిన పదార్థాలను బయట పడవేయడంతో వాటికోసం వస్తూ.. వీధికుక్కల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. నగరంలో ఆహార వృధాను అరికడితే చాలా వరకు వీధి కుక్కల సంఖ్య నియంత్రణలోకి వస్తుంది.

కార్పొరేషన్ చర్యలు..

విజయవాడ నగరంలో వీధి కుక్కలను డాగ్ క్యాచర్లు సింగ్‌నగర్‌లో ఉన్న యానిమల్ బర్త్ సెంటర్‌కు తరలిస్తున్నారు. అక్కడ వాటికి కుటుంబనియంత్రణ ఆపరేషన్‌లు చేసి కోలుకున్నాక ఎక్కడి నుంచి తీసుకెళ్లారో అక్కడే వదిలేస్తున్నారు.

ఇప్పటి వరకు 12వేల ఆపరేషన్‌లు

- డాక్టర్ సోమశేఖర్ రెడ్డి, వెటర్నరీ సర్జన్,

యానిమల్ బర్త్‌సెంటర్‌లో రోజుకి 30 నుంచి 40 వీధి కుక్కలకు కుటుంబనియంత్రణ ఆపరేషన్‌లు చేస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటి వరకు 12వేల ఆపరేషన్లు చేశాం.



సింగ్‌నగర్‌లోని యానిమల్ బర్త్ సెంటర్‌లో వీధి కుక్కలకు కుటుంబనియంత్రణ ఆపరేషన్‌లు

పెరుగుతోన్న కుక్కకాటు బాధితులు

- డాక్టర్ ఇందిరా, ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు



ప్రభుత్వాసుపత్రిలో నమోదవుతున్న కేసులను పరిశీలిస్తే కుక్కల సంఖ్య పెరుగుతున్నట్లే. కుక్కకాట్లకు ప్రభుత్వాసుపత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయి. ఏటా కేసులు పెరుగుతున్నాయి. కుక్కకాటు బాధితులకు టీటీ ఇంజక్షన్, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇవ్వాలి. వీటితో పాటు ఇమ్యునోగ్లోబులిన్ డోస్‌లు 15+15 డోస్‌లు ఇవ్వాలి.

పెంపుడు కుక్కలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పెంపుడు కుక్కలకు నాలుగునెలల వయస్సులో ఫస్ట్ డోస్ వ్యాక్సిన్ వేయించాలి. బూస్టర్ డోసులు, వాక్సిన్‌లు క్రమం తప్పకుండా వేయించాలి. కుక్కలు ఇంట్లో విసర్జికుండా చూసుకోవాలి. దీనివల్ల ఇంట్లో వారికి ఆరోగ్య సమస్యలు వస్తాయి. కుక్కలకు చేతులతో స్వయంగా తినిపించి అదే చేతితో భోజనం తినరాదు. కుక్కల లాలాజలం కలిస్తే చాలా ప్రమాదం.

మార్క్‌ఫెడ్ స్థలాల్లో ఆక్రమణలు తొలగిస్తాం

» మచిలీపట్నంలో రూ.6 కోట్లతో గిడ్డంగి పునర్నిర్మాణం

» మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు



మచిలీపట్నంలో శిథిలమైన మార్క్‌ఫెడ్ మిల్లు, గిడ్డంగులను సందర్శించిన చైర్మన్ బంగార్రాజు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం, బొబ్బిలి, కడపల్లో మార్క్‌ఫెడ్ స్థలాల్లోని ఆక్రమణలను తొలగిస్తామని, మచిలీపట్నం మార్కెట్ స్థలంలో రూ. 6 కోట్లతో గిడ్డంగులు నిర్మిస్తామని మార్క్‌ఫెడ్ చైర్మన్ కె.బంగార్రాజు పేర్కొన్నారు. శుక్రవారం మచిలీపట్నం రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న మార్క్‌ఫెడ్ రైస్‌మిల్లు, గిడ్డంగులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ స్థితిగతులను తెలుసుకునేందుకు పర్యటిస్తున్నామన్నారు. మచిలీపట్నం మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కార్యాలయం, శిథిలమైన మార్క్‌ఫెడ్ రైస్‌మిల్లు, గిడ్డంగులను పరిశీలించామని, మార్క్‌ఫెడ్ రైసుమిల్లు, గిడ్డంగులను తొలగించి ఆ స్థలంలో రూ. 6 కోట్లతో నూతన గిడ్డంగిని నిర్మిస్తామన్నారు. ఇందుకు త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. శిథిలమైన గిడ్డంగులను తొలగించే కార్యక్రమాన్ని వెంటనే చేపడతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మార్క్‌ఫెడ్ ఆస్తులను పరిశీలిస్తున్నామన్నారు. బొబ్బిలిలో మార్క్‌ఫెడ్ స్థలాన్ని టిడ్కో ఇళ్లకు డైవర్ట్ చేశారని, తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ భూమిని తీసుకున్నామన్నారు. ప్రహరీ నిర్మించేందుకు టెండర్లు పిలుస్తున్నామన్నారు. కడప మార్క్‌ఫెడ్ స్థలంలో ఆక్రమణలు తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్నామన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా మార్క్‌ఫెడ్ పనిచేస్తుందన్నారు. గతేడాది ఆగస్టు నాటికి సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా 8307 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారని, ఈ ఏడాది కృష్ణాజిల్లాలోని 160 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో 12,627 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామన్నారు. రైతు సేవాకేంద్రాల ద్వారా మరో392 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురవడం, రైతులు ఒకేసారి పంటను నాటడం వల్ల యూరియా కొరత ఏర్పడిన మాట నిజమేనన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎరువులను అధిక ధరలకు అమ్మితే విజిలెన్స్ అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు జిల్లా మేనేజర్ మురళీకిషోర్, డీఈఈ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి ఉఫ్..

(5వ పేజీ తరువాయి)

గ్రామస్థాయి సోషల్ ఆడిట్ సిబ్బంది నివేదికలో వెల్లడించారు. కుమ్మమూరులో మృతిచెందిన మండపాక శివాజీ మూడు రోజులు కూలిపని చేసినట్టు చూపించి, డబ్బు చెల్లించారు. ఓ కుటుంబంలో పెళ్లి కాకుండానే రెండు జాబ్‌కార్డులు ఇచ్చి 36 రోజులు పనిచేసినట్టు చూపారు. డిస్ట్రిబ్యూటరీ చానల్ తవ్వకాల్లో 590 మీటర్లు ఓ చోట, 720 మీటర్లు మరోచోట తవ్వకుండానే తవ్వినట్టు చూపారు. యాకమూరు పంచాయతీ పరిధిలో ఓ పంట కాల్వలో కూలీలు మట్టితవ్వకం జరిపితే.. అదే పంటకాల్వలో కుమ్మమూరు కూలీలు మట్టి తవ్వకాలు జరిపినట్టు తెలిపారు. ఈ పనికి యాకమూరులో, కుమ్మమూరులో డబ్బు చెల్లించినట్టు చూపడం ఈ అక్రమాలను తెలియజేస్తోంది. పెనమకూరులో ఓ పనికి ఎంబుక్ ప్రకారం రూ.62 వేలు చూపగా, రూ.1.40 లక్షలు కూలీలకు చెల్లించినట్టు చూపారు. తోట్లవల్లూరులోని ఓ పంటకాల్వలో ఏకంగా 900 మీటర్లు మట్టి తవ్వకుండానే తవ్వినట్టు చూపారు. గరికపర్రు, కనకవల్లి, భద్రిరాజుపాలెం, బొడ్డపాడు తదితర గ్రామాల్లో భారీ అక్రమాలు వెలుగు చూశాయి.

లెక్కతేలని అక్రమాలు

ఏటా సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిపిన సాయంత్రానికే ఏయే ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ) ఎన్ని అక్రమాలు చేశాడు, అతని నుంచి ఎంత రికవరీ చేయాలో అధికారులు లెక్క చెప్పేవారు. ఈసారి లెక్క తేల్చలేకపోయారు. ఓ అధికారి అనధికారికంగా చెప్పిన సమాచారం ప్రకారం మొత్తం రూ.25 లక్షల వరకు అక్రమాలు తేలాయని, ఇందులో రూ.10 లక్షలు రికవరీ ఉండొచ్చని, మరో రూ.15 లక్షలకు రీ వెరిఫికేషన్ అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రజా వేదిక కార్యక్రమంలో ఎంపీపీ ఈడుప్పుగంటి రాజామణి, అంబుడ్స్‌పర్సన్ కేవీ శ్రీనివాసరావు, ఎంపీడీవో రవికాంత్, డీఎల్‌డీవో రాజేశ్, ఎం.సునీల్‌కుమార్, ఏపీఎం సురేశ్, డీఆర్‌వో సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నయ్య వెంటే కన్నతల్లి

(5వ పేజీ తరువాయి)

యువకుడికి బైక్ ఇచ్చి వారిని తీసుకురమ్మని రేణుక తెలిపింది. టోల్‌గేట్ వద్ద బస్సు దిగాక చైతన్య, బాబును తీసుకుని మోటార్ సైకిల్ ఎక్కింది. మోటారు సైకిల్ పెండ్యాల రూట్‌లోకి వెళ్లే క్రమంలో వెనుక నుంచి వచ్చిన లారీ వారిని ఢీకొట్టింది. ప్రమాదంలో బలమైన గాయాలు కావడంతో మూడు నెలల అద్విక్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తల్లి చైతన్యకు బలమైన గాయాలు కాగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. శ్రీరామ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విగతజీవులుగా మారిన చైతన్య, అద్విక్‌లను చూసి తల్లి మరియమ్మ, ఇతర బంధువులు గుండెలవిసేలా రోదించారు. కంచికచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్సీ-25 ర్యాంకర్లు వీరే

(5వ పేజీ తరువాయి)

హిందీ : సయ్యద్ ఖాసిం సైదా(ఓసీ) 86.02 మొదటి ర్యాంకు, దూది బార్గవ్‌కుమార్(బీసీ-బీ) 84.90 రెండో ర్యాంకు, రమేష్ రమణపోలున్(బీసీ-బీ) 84.87 మూడో ర్యాంకు, రామిశెట్టి మాధవి(ఓసీ) 83.62 నాలుగోస్థానం సాధించింది,

సంస్కృతం: గ్రంధి అమరేశ్వకుమార్ (ఓసీ)89.73 మొదటి ర్యాంకు, కె.సాహిత్య(బీసీ-బి)57.27 రెండోర్యాంకు, గుంటూరు శ్రీనివాస్(ఓసీ) 54.67 మూడో ర్యాంకు సాధించారు. బి.ఉమామహేశ్వరరావు(బీసీ-ఏ) 51.4నాలుగో ర్యాంకు సాధించారు.

తెలుగు : ఉమ్మడి జిల్లాలో 1222మంది మెరిట్ సాధించారు. గుడివాడ ఆదిలక్ష్మి (ఓసీ)87.53 మొదటి ర్యాంకు, తాళ్లూరి సత్యనారాయణ(బీసీ-ఎ) 54.55 రెండోర్యాంకు, బడే బేబి(ఓసీ) 83.8 మూడోర్యాంకు, బత్తు వందన(ఓసీ) 82.89 నాలుగో ర్యాంకు సాధించారు.

ఉర్దూ : ఉమ్మడి జిల్లానుంచి 208మంది అర్హత సాధించారు. షబీహ తస్లీమ్(బీసీ-ఈ) 73.90 మొదటిర్యాంకు, అలీ అబ్బాస్ (బీసీ-ఈ)69.07 రెండోర్యాంకు, జహీన్‌అలీ మీర్జా(బీసీ-ఈ) 66.87 మూడో ర్యాంకు, మహ్మద్ అబ్దుల్ అలీం(బీసీ-ఈ) 56.43 నాలుగో ర్యాంకు సాధించారు.

బయోలాజికల్ సైన్స్: ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 2,428 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ఓ.దివ్యలావణ్య(ఎస్సీ గ్రేడ్-3) 85.10 మొదటి ర్యాంకు సాధించారు. ఎస్. అమలేశ్వరి(ఎస్సీ గ్రేడ్-3) 83.05 రెండో ర్యాంకు సాధించారు. శీలం పావని(బీసీ-డీ) 80.70 మూడో ర్యాంకు సాధించింది. ఏమని మౌనిక(ఓసీ) 80.06 నాలుగో ర్యాంకును సాధించారు.

గణిత విభాగానికి సంబంధించి ఉమ్మడి కృష్ణా జిల్లాలో 2,889 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బొడ్డు వెంకటేశ్వరరావు(బీసీ-ఏ) 87.72 శాతంతో మొదటి ర్యాంకు సాధించారు. ఉద్దండి (ఓసీ) 83.17 శాతం మార్కులతో రెండో ర్యాంకు సాధించారు. కోట నాగరాజు(ఎస్సీ గ్రేడ్-2) 82.56 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. వినుకొండ కనకదుర్గ(బీసీ-ఏ) 82.15 మార్కులతో నాలుగో ర్యాంకు సాధించింది.

ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 945 మంది అభ్యర్థులు మెరిట్ సాధించారు. వీరిలో అలపర్తి నరేంద్ర(ఓసీ) 88 మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. పల్లేడ కృష్ణవేణి(బీసీ-డీ) 88 మార్కులతో రెండో ర్యాంకు సాధించారు. చిలకలపూడి దుర్గాప్రసాద్(బీసీ-ఏ) 86 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. మేకల నరేష్(ఎస్సీ గ్రేడ్-2) 55.5 మార్కులతో నాలుగో ర్యాంకు సాధించారు.

ఫిజికల్ సైన్స్ విభాగంలో ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 1,487 మంది మెరిట్ సాధించారు. వీరిలో అరిగెల నాగమణి(ఓసీ) 81.85 మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. పెద్ది అన్నారావు(ఓసీ) 81.62 మార్కులతో రెండో ర్యాంకు సాధించారు. జానలపాటి స్వాతి(ఓసీ) 81.1. మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. డి.చంద్రశేఖరరావు(ఓసీ) 80.52 మార్కులతో నాలుగో ర్యాంకు సాధించారు.

సోషల్ స్టడీస్ విభాగంలో ఉమ్మడి జిల్లాలో 3,786 మంది మెరిట్ సాధించారు. వీరిలో నవీన్ పురామా(ఓసీ) 89.74 మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. కోలా రామాంజనేయులు (ఓసీ) 87.04 మార్కులతో రెండో ర్యాంకు సాధించారు. గోళ్ల హేమకుమారి(బీసీ-బీ) 86.71 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. తాళ్లూరి నాగేంద్ర బాబు(ఎస్సీ గ్రేడ్-2) 85.09 మార్కులతో నాలుగో ర్యాంకు సాధించారు.

జాతీయ బ్యాంక్‌కు దీటుగా సహకార బ్యాంకులు



విస్సన్నపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ బ్యాంకులకు దీటుగా అవసరమైన వారికి రుణాలు అందజేస్తూ.. రైతుల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్నామని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. విస్సన్నపేట సర్కిల్ పరిధిలోని బ్యాంకు మేనేజర్లు, సూపర్‌వైజర్లతో ఆయన శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సహకారసంఘాల ద్వారా ఎరువులు, జనఔషధ కేంద్రాలు ఏర్పాటు చేసి ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సహకార సంఘాల బ్యాంకులన్నింటినీ కంప్యూటకరించామన్నారు. రైతులకు లక్ష వరకు సున్నా వడ్డీ, లక్ష నుంచి 3 లక్షల వరకు ఏడుశాతం వడ్డీకి రుణాలు అందిస్తున్నట్టు చెప్పారు. పెట్రోల్ బంకులను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. 7,500 మంది డ్వాక్రా మహిళలకు రుణాలు అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సీఈవో శ్యామ్ మనోహర్, జీఎం ఎస్.రంగబాబు, డీజీఎం శ్రీనివాసులు, ఏజీఎం దేవేందర్, సొసైటీ అధ్యక్షుడు కంభంపాటి బదిరీనాథ్, బ్రాంచ్ మేనేజర్ లక్ష్మి ప్రసాద్‌లు పాల్గొన్నారు.

మాజీ సీఎం వైఎస్ జగన్ అమరావతిపై విషం చిమ్ముతున్నాడని నెట్టెం రఘురాం అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఆయన్ను విమర్శించేందుకు తెలుగు నిఘంటువులో పదాలే లేవన్నారు. పులివెందుల ఎన్నికల్లో చతికలపడినా జగన్‌కు జ్ఞానోదయం కాలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో అమరావతి శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు.

ఇదేం ఎంపిక ఆచార్యా..!

(5వ పేజీ తరువాయి)

చిత్తానుసారం వ్యవహరిస్తున్నారు. ఒక ఉపాధ్యాయుడిని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసేందుకు సిఫార్సు చేయటం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఇంటర్వ్యూలు నిర్వహించినా..

జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసేందుకు డీఈవో కార్యాలయ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ ఉన్న స్కూల్ అసిస్టెంట్లు ఏడుగురు, సెకండరీ గ్రేడ్ టీచర్లు ఏడుగురిని ఎంపిక చేశారు. వీరికి ఈనెల 14న ఐదుగురు సభ్యులతో కూడిన బృందం ఇంటర్వ్యూలు నిర్వహించింది. విద్యార్హతలు, విద్యాభివృద్ధికి వారు చేసిన కృషి వివరాలు, ఇతరత్రా అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. స్కూల్ అసిస్టెంట్ల నుంచి ఇద్దరిని, సెకండరీ గ్రేడ్ టీచర్ల నుంచి ఇద్దరిని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చే సేందుకు సిఫార్సు చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి వివరాలు పంపారు. రెండు రోజుల క్రితం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూలకు ఈ ఉపాధ్యాయులు హాజరయ్యారు. అయితే, ఈనెల 14న జరిగిన ఇంటర్వ్యూకు హాజరుకాని ఓ ఉపాధ్యాయుడు విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు రావడంతో ఆశ్చర్యపోయారు. మొదటి ఇంటర్వ్యూకు హాజరుకాని ఉపాధ్యాయుడి పేరును జాబితాలో ఎలా చేర్చారని ఉపాధ్యాయులు డీఈవోను ప్రశ్నించారు. ఈ విషయంపై విచారణ చేస్తానని, బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని సముద్రతీరాన ఉండే మండల విద్యాశాఖాధికారి ఈ వ్యవహారంలో చక్రంతిప్పి అధికారులను పక్కదారి పట్టించారనే ఆరోపణలు వస్తున్నాయి.

యూరియా కష్టాలు

(5వ పేజీ తరువాయి)

ఇతర కాంప్లెక్స్ ఎరువుల కోసం రైతులు పీఏసీఎస్‌లకు వెళ్లగా, స్టాక్ ఇంకా రాలేదని చెప్పి పంపేస్తున్నారు. 45 కిలోల యూరియా కట్టను రూ.266.60కు విక్రయించాల్సి ఉండగా, కొందరు పెద్దలు దారి మళ్లించి ఒక్కో కట్టను రూ.350 నుంచి రూ.450కు అమ్ముతున్నారు. ఇదేమని రైతులు ప్రశ్నిస్తే సమాధానం చెప్పేవారే లేకుండాపోయారు. జిల్లా వ్యవసాయ అధికారులను తమ గుప్పెట్లో పెట్టుకున్న పెద్దలు తమదైనశైలిలో ఇలా చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. యూరియా, ఇతర ఎరువుల కొరతపై వివరాలు కోరగా.. ఎంతమేర వచ్చిందనేది చెప్పలేమని, వచ్చిన ఎరువులను ధామాషా ప్రకారం వ్యాపారులకు, పీఏసీఎస్‌లకు పంపామని, అంతకుమించి వివరాలు తమ వద్ద లేవని వ్యవసాయ శాఖ కార్యాలయ అధికారులు చెబుతున్నారు.

నందమూరు పీఏసీఎస్ వద్ద తోపులాట

పెడన మండలం నందమూరు పీఏసీఎస్‌కు శుక్రవారం 550 కట్టల యూరియా వచ్చింది. బల్లిపర్రు, మడక, జింజేరు, అచ్యుతాపురం, నందమూరు గ్రామాల రైతులు యూరియా కోసం ఈ పీఏసీఎస్‌కు వచ్చారు. ఎకరాకు అరకట్ట, మూడు ఎకరాలకు పైబడి ఎంత భూమి సాగుచేసినా రెండు కట్టల యూరియాకు మించి ఇచ్చేది లేదని పీఏసీఎస్ సిబ్బంది తెగేసి చెప్పారు. దీంతో రైతులు తిరగబడ్డారు. ఐదు ఎకరాలకు పైబడి భూమిని సాగుచేసే రైతులకు రెండ కట్టలు ఎలా సరిపోతుందని వాదనకు దిగారు. సాగుచేసిన భూమిని బట్టి ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో తోపులాట జరిగింది. పీఏసీఎస్ వద్దకు మహిళలు కూడా వచ్చి క్యూలో నిలబడ్డారు. కొద్దిసేపు తోపులాట జరిగింది. పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. కొంత మంది రైతులకు ఇచ్చి, అనంతరం స్టాక్ అయిపోయిందని చెప్పారు. పెడన మండలంలోని ముచ్చర్ల పీఏసీఎస్‌కు 200 కట్టల యూరియా రాగా, లంకలకలవగుంట గ్రామంలో యూరియాను దించి, ఆ గ్రామస్తులకు ఇచ్చి సరిపెట్టేశారు. దీంతో మిగిలిన గ్రామాల రైతులు తిరగబడ్డారు.

బందరు మండలంలో పరిస్థితి ఇదీ..

తొమ్మిదో నెంబరు పంటకాల్వ శివారున బందరు సౌత్ మండలంలోని అన్ని గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. నారుమడులకు యూరియా లేకపోవడంతో రైతులంతా ఇబ్బందులు పడ్డారు. వాడపాలెం పీఏసీఎస్‌కు శుక్రవారం 100 టన్నుల యూరియా ఇచ్చారు. విక్రయాలు ప్రారంభించిన రెండు, మూడు గంటల్లోనే స్టాక్ అయిపోయింది. నెలకుర్రు పీఏసీఎస్‌కు గతంలో 60 టన్నుల యూరియా ఇచ్చారు. తమ పీఏసీఎస్ పరిధిలోని 13 గ్రామాల్లో వరినాట్లు వేగవంతమయ్యాయని, మళ్లీ యూరియా కావాలని ఇండెంట్ పెడితే ఇప్పట్లో రాదని చెప్పి సరిపెడుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

రేషన్ బియ్యం పట్టివేత

పెనమలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పోరంకి ప్రభునగర్‌లో 1,025కిలోల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పెనమలూరు ఎస్సై ఉషారాణి ఆధ్వర్యంలోని పోలీసు బృందం గురువారం అక్రమార్కులను అదుపులోకి తీసుకొని వారి వద నుంచి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలో జరుగుతున్న వివిధ అభి వృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎమ్మె ల్యే అధికారులు, టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావుతో కలిసి మునిసిపాలిటీలోని నాలుగు క్లస్టర్లయిన పోరంకి కానూరు, తాడిగడప, యనమలకుదురులలో కోట్ల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కానూరు ప్రధాన రోడ్డు, సూపర్‌విజ్ రోడ్డు, డ్రైన్లు నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా జాప్యం జరగడానికి వీల్లేదని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి అభివృద్ధి పనులు చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చలవవల్లేనన్నారు. ఎమ్మెల్యే వెంట కమిషనర్ షేక్ నజీర్, ఈఈ డి. నాగభూషణం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యతోపాటు విలువలూ నేర్చుకోవాలి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గుంటూరు జడ్పీ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం



రక్తదాన శిబిరంలో జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గుంటూరు జడ్పీ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం

కానూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతో పాటు విలువలూ నేర్చుకోవాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గుంటూరు జడ్పీ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం అన్నారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్, బ్రహ్మకుమారీస్ రాజయోగిని ఉపాధ్యాయుల బృందం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి గద్దె రామ్మోహన్, పాతూరి నాగభూషణం ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిద్ధార్థ వర్సిటీ విద్యా ర్థులకు నైపుణ్యాలు పెంపునకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. అన్ని దానాలకన్న రక్తదానం మిన్నఅని, ప్రతిఒక్కరూ విధిగా రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలు కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా 230 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రొ. వీసీ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్, డీన్ డి. వెంకట్రావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జె. శివరాం ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. సుష్మాచౌదరితోపాటు పలువురు ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉయ్యూరు ఆర్టీసీ డిపోలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఈడీ విజయరత్నం

స్త్రీ శక్తి పథకం సక్సెస్

● ఆర్టీసీ విజయవాడ జోన్ ఈడీ జి.విజయరత్నం

ఉయ్యూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం అమలు చేసిన స్త్రీశక్తి పథకం పట్ల మహిళల నుంచి విశేష స్పందన లభిస్తుందని ఆర్టీసీ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.విజయరత్నం అన్నారు. ఉయ్యూరు ఆర్టీసీ డిపోను శుక్రవారం ఆయన సందర్శించి, ఉద్యోగులతో మాట్లాడుతూ, స్త్రీశక్తి పథకం వల్ల బస్సుల ఓఆర్ పెరిగి సంస్థకు ఆదాయం పెరుగుతుందన్నారు. బస్సులు కండషన్‌లో ఉండేలా చూడాలని, ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహరించి ఓఆర్ మరింత పెరిగేలా కృషి చేయాలన్నారు. డిప్యూటీ సీటీఎం శివరామ్, ఈఈ రాజశేఖర్, ఉయ్యూరు డిపో మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.



అనధికార కట్టడాన్ని కూల్చివేస్తున్న మునిసిపల్ సిబ్బంది

అనధికార కట్టడం కూల్చివేత

పెనమలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలోని కానూరు, యనమలకుదురు గ్రామాల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను మునిసిపల్ అధికారి అరుణ ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది కూల్చివేశారు. మునిసిపల్ పరిధిలో ఎటువంటి అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించమని, బిల్డర్లు సహకరించని పక్షంలో వారిని బ్లాక్ లిస్టులో పెడతామని కమిషనర్ షేక్ నజీర్ హెచ్చరించారు.

జంక్షన్ బస్టాండ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్‌లో దాతల సాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఆర్టీసీ గన్నవరం డిపో మేనేజర్ శివాజీ శుక్రవారం తెలిపారు. బస్టాండ్‌లో జేబుదొంగల బెడద నుంచి ప్రయాణికులకు కాపాడేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పారిశ్రామికవేత్త, విశ్వహిందు పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్‌ను కలిసి ఆర్థికసాయం కోరడం జరిగిందని ఆయన సానుకూలంగా స్పందించారని 12 కెమెరాలు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు డీఎం తెలిపారు.



జంక్షన్‌లో మానవత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

సామాజిక సేవే మానవత లక్ష్యం

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవే లక్ష్యంగా ప్రజల భాగస్వామ్యంతో మానవత సంస్థ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో శుక్రవారం మానవత ఆవిర్భావ దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ సభ్యులు పేకేటి వీరేంద్రరెడ్డి 25 మంది పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం జంక్షన్ నాలుగు రోడ్లలో ద్విచక్ర వాహనాలపై నిర్వాహకులు శాంతిర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాన వత నిర్వాహకులు బాణాల నరసింహారావు, జేవీవీ సత్యనారాయణ, నారగాని కొండలరావు, కొట్నాని రామచంద్రరావు, అక్కినేని రాఘవేంద్రరావు, పీవీఎస్. చలం, ఘంటా సత్యనారాయణ, ఇందిరాదేవి, తదితరులు పాల్గొన్నారు.



కలవపాములలో లైసెన్స్ లేకుండా ఎరువులు విక్రయిస్తున్న దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

ఎరువుల షాపు యజమానిపై కేసు

ఉయ్యూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కలవపాములలో లైసెన్స్ లేకుండా ఎరువులు విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులకు వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఇటీవల ప్రారంభించిన పునీతమాత ఎరువుల దుకాణంలో యూరియా బ్లాకులో అమ్ముతున్నారన్న సమాచారం మేర వ్యవసాయ శాఖ గన్నవరం అసిస్టెంట్ డైరెక్టర్ సునీల్‌కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి నిస్సీగ్రేస్, సివిల్‌సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ ప్రధాన్ తదితరులు పునీతమాత ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఎరువులు విక్రయించేందుకు అవసరమైన లైసెన్స్ లేకపోవడం, తప్పుడు లైసెన్స్‌తో విక్రయాలు జరుపుతున్నట్టు గమనించి దుకాణంలో ఉన్న రూ.1,32, 00 విలువగల ఎరువులు స్వాధీన పరుచుకుని యజమాని దిలీప్ కుమార్‌పై ఉయ్యూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించారు.

కమిషనర్‌ను నియమించాలి

ఉయ్యూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు నగర పంచాయతీకి కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇతర ఉద్యోగులను నియమించాలని కోరుతూ మున్సిపల్ మంత్రి పి.నారాయణకు వినితిపత్రం అందజేసినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ శుక్రవారం తెలిపారు. కమిషనర్ ఉద్యోగ విరమణ చేసి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు నియమించకపోవడంతో ఇన్‌చార్జ్ అధికారుల పాలనలో పరిపాలన సరిగా జరగడంలేదని మంత్రిని కలసి వివరించామని తెలిపారు.



లక్ష గులాబీలతో అర్చన చేస్తున్న భక్తులు.. రాజరాజేశ్వరిదేవికి..

లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఘనంగా లక్ష గులాబీలార్చన

గన్నవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో శ్రావణమాసం ఐదో శుక్రవారం సందర్భంగా లక్ష గులాబీలతో పుష్పార్చన జరిపారు. తొలుత అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీతిరుపతమ్మ సన్నిధిలో లక్ష గులాబి పుష్పాలతో భక్తిశ్రద్ధలతో అర్చన జరిపారు. ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మీ)కు పూజలు నిర్వహించిన భక్తులు గ్రామ పొంగళ్లను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి నివేదించారు. యూఎస్ఏకు చెందిన పాలడుగు సాయిస్వరూప్, భవిత దంపతుల సౌజన్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం భక్తులచే శ్రీలక్ష్మీ సహస్రనామ కుంకుమార్చనలు, లలిత సహస్రనామ పారాయణం, లక్ష్మీ అష్టోత్తరం, హనుమాన్ చాలీసా పారాయణం జరిపారు. ఆలయ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవికి అభిషేకాలు

హనుమాన్‌జంక్షన్: స్థానిక శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకొని రాజరాజేశ్వరిదేవికి విశేషద్రవ్యాలతో అభిషేకం ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామితో పాటు రాజరాజేశ్వరి దేవికి కూడా అభిషేకాలు జరిపారు. ఆలయ ట్రస్టీ కాకాని అరుణ తదితర భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



వేలేరులో శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపులో కృష్ణస్వామి

సర్వమతాల సారం భగవద్గీత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జీవాత్మ, పరమాత్మల గురించి ప్రజలకు తెలియజెపుతూ సర్వమతాలను సమన్వయం చేసేలా శ్రీకృష్ణుడు అందించిన గ్రంథం భగవద్గీత అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి నూజివీడు కమిటీ అధ్యక్షుడు కృష్ణస్వామి తెలిపారు. వేలేరులో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకల ముగింపు సందర్భంగా శుక్రవారం శ్రీకృష్ణ విగ్రహాన్ని మేళతాళాల మధ్య ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌కుమార్, వేములపల్లి ఝాన్సీలక్ష్మి, శ్రీనివాసరావు, తారకరామకృష్ణ, శ్రీకృత, శ్రీత్రైత, పాలడుగు లక్ష్మణ్, భరత్, నర్మద, హితాక్ష, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ప్రబోధ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



మొక్కలు నాటుతున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్ దుర్గారావు

హనువమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని కాపాడేలా చెట్లను నాటి సంరక్షించడంతో పాటు సహజ వనరులను కాపాడుకుంటూ సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది అని పీఏసీఎస్ చైర్‌పర్సన్ దన్నే దుర్గారావు అన్నారు. కానుమోలులో రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం చిరంజీవి జన్మదినోత్సవ సందర్భంగా పీఏసీఎస్ ఆవరణలో పండ్ల మొక్కలు నాటారు. భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించేలా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాల న్నారు. రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్, టీడీపీ అధ్యక్షుడు దన్నే మల్లికార్జునరావు, ముత్యాల విక్రమ్ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల నిర్వహణకు పోలీసు శాఖ అనుమతి తప్పనిసరి

పెనమలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గణేష్ పందిళ్ల ఏర్పాటుకు, ఉత్సవాల నిర్వహణకు పోలీసు శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పెనమలూరు సీఐ వెంకటరమణ స్పష్టం చేశారు. మండపాల వద్ద డీజేల ఏర్పాటుకు అనుమతి లేదని ఎవరయినా డీజేలను ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి మండపానికి సింగిల్ విండో వ్యవస్థ ద్వారా అనుమతులు సులభతరం చేశామని తెలిపారు. ఎదుటి వారిని కించపరిచే విధంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయకూడదని హెచ్చరించారు. మండపం వద్దగాని, ఊరేగింపు వద్ద గాని ఎటువంటి అవాంఛనీయ ఘటన జరిగినా కమిటీ వారిదే పూర్తి బాధ్యతని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.

కంకిపాడు : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా పోలీసు వారి అనుమతులు తీసుకోవాలని ఎస్సై డి. సందీప్ తెలిపారు. పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రతి ఏటా వినాయక చవితి పందిళ్లు ఏర్పాటు చేస్తుంటారని, అటువంటి కమిటీలు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఆన్ లైన్ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవచ్చు అని సూచించారు. ప్రతి పందిరి వద్ద తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు వారికి అందుబాటులో ఉండాలని తెలియజేశారు.



చీరలు పంపిణీ చేస్తున్న సీతారామస్వామి కుటుంబ సభ్యులు

అన్నదానం, చీరల పంపిణీ

పెనమలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కస్తూరి సీతారామస్వామి ఐదవ వర్ధంతి సందర్భంగా గోసాల వాసవ్య మహిళా మండలి అనాథ శరణాలయంలో వారి కుటుంబ సభ్యులు శుక్రవారం అన్నసంతర్పణగావించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంకిపాడు కో-కన్వీనర్ పులి శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, కస్తూరి ఝాన్సీలక్ష్మి, పచ్చిపాల అనురాధ, కస్తూరి రాజ్యలక్ష్మి, పిచ్చుక క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెనమలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు సాయినగర్‌లోని 11కేవీ ఫీడర్ పరిధిలో లైన్ల మరమ్మతుల నేపథ్యంలో నేడు ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు గుణదల విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు తెలిపారు. సాయినగర్, పుట్టరోడ్డు, మాదు తిరుపతిరావు నగర్ టవర్ రోడ్డు, శివపార్వతి నగర్ ప్రాంత ప్రజలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



ఉయ్యూరులో ఆటో డ్రైవర్ల నిరసన

ఉయ్యూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ఉయ్యూరులో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రతి కార్మికుడికి వాహనమిత్ర పథకం కింద రూ. 25 వేలు ప్రభుత్వం ఇవ్వాలని, ఆటో కార్మికులకు ఉరితాడులాంటి జీవో నంబరు 21ని రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ గ్యాస్ ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు. ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలినాయుడు, మండల కన్వీనర్ రాజేశ్, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు పోతురాజు, ప్రభాకరరావు, రమేశ్, చంటి పాల్గొన్నారు.



సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో చివరి శ్రావణ శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఐదవ, చివరి శ్రావణ శుక్రవారం కావటంతో వేల మంది భక్తులు, ముఖ్యంగా మహిళలు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. ఉదయం 7గంటల నుంచి 9 గంటల వరకు ఆర్జిత సేవా వ్రతాలు, 10గంటల నుంచి 11.30 గంటల వరకు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. ఈ.వో వి.కె.శీనానాయక్ భక్తులకు అసౌకర్యం కలగకుండా స్వయంగా పర్యవేక్షించారు. భక్తులకు తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించేలా పలు సూచనలు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదం, నిరంతర అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.



కోడ్ స్పార్క్-2025 జాతీయ స్థాయి హ్యాక్‌థాన్‌లో మాట్లాడుతున్న ఏపీటీఎస్ ఎండీ సూర్యతేజ

యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

● ఏపీటీఎస్ ఎండీ సూర్యతేజ

వన్‌టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : అద్భుతమైన యువశక్తి కలిగిన ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తులో ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా రూపుదిద్దుకోనుందని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజికల్ సర్వీసు(ఏపీటీఎస్) మేనేజింగ్ డైరెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. కోడ్ స్పార్క్-2025 జాతీయ స్థాయి హ్యాక్‌థాన్ కార్యక్రమాన్ని కేబీఎన్ కళాశాలలో శుక్రవారం సూర్యతేజ ప్రారంభించారు. విజయం సాధించటానికి పటిష్టమైన ప్రణాళిక అవసరమన్నారు. స్టార్టప్, ఇన్నోవేషన్ రంగాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో హ్యాక్‌థాన్ నిర్వహిస్తామని, అందులో ఉత్తమంగా నిలిచిన యువతకు ఎటువంటి టెండర్ పిలవకుండానే నేరుగా కోటి రూపాయల వరకు పెట్టుబడి పెట్టి స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామని చెప్పారు. రుషికొండలో స్టార్టప్ హబ్ ఏర్పాటు చేశామని, ప్రతి విద్యార్థి దానిని సందర్శించాలని కోరారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పారిశ్రామికవేత్తలుగా యువత ఎదిగేందుకు అన్నివిధాల చేయూతనిస్తామన్నారు ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు సూచించే దిశగా స్టార్టప్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, సెక్రటరీ టి.శ్రీనివాస్, కంప్యూటర్ విభాగాధిపతి రవీంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

బందరు మార్గంలో వాహనాల మళ్లింపు

● గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్



గుడివాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ పెద్ద కాలువ సెంటర్ వద్ద రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా పెద్ద కాలువ సెంటర్ నుంచి మచిలీపట్నం వైపు వెళ్లే వాహనాలు దారి మళ్లించడం జరిగిందని డీఎస్పీ ధీరజ్ వినీల్ తెలిపారు. డీఎస్పీ ధీరజ్ వినీల్ శుక్రవారం విలేకరులతో మా ట్లాడారు. గుడివాడ నుంచిమచిలీపట్నం వెళ్లే వాహనాలు పెద్ద కాలువ సెంటర్ మీదుగా పామర్రు రోడ్డు, బిళ్లపాడు రైల్వే గేటు, చిన్న ఎరుకపాడు కొత్త బైపాస్ రోడ్డు, బొమ్మలూరు నుంచి గుడ్లవల్లేరు మీదుగా వెళ్లాలని సూచించారు. మచిలీపట్నం నుంచి గుడివాడ వచ్చే వాహనాలు బొమ్ము లూరు కొత్త బైపాస్ రోడ్డు ఎడమ వైపునకు (పామర్రు రోడ్డుకు)తిరిగి చిన్న ఎరుకపాడు నుంచి కుడివైపునకు తిరిగి బిళ్లపాడు రైల్వే గేటు, పెద్దకాలువ సెంటర్, కేటీఆర్ ఆర్ కళాశాల మీదుగా గుడివాడకు రావాలని సూచించారు. గుడివాడ ట్రాఫిక్ పోలీసుల సూచనల మేరకు నిబంధనలు పాటించి వాహనదారులు గమ్యస్థానాలను చేరాలని డీఎస్పీ ధీరజ్ వినీల్ చెప్పారు.



టీచర్ గాయత్రిని ప్రశ్నిస్తున్న విద్యార్థిని తల్లిదండ్రులు

బెత్తం విసిరిన టీచర్.. విద్యార్థినికి గాయం

పెడన, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : దక్షిణతెలుగుపాలెం ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి విద్యార్థిని తేష్మిత(6)పై టీచర్ గాయత్రి గురువారం బెత్తం విసిరింది. బెత్తం పొరపాటున చెవికి దిగువ భాగంలో గుచ్చుకుని గాయమై రక్తం కారింది. తల్లిదండ్రులకు తెలిస్తే గొడవ అవుతుందని భావించిన టీచర్ గాయత్రి 45 నిమిషాల పాటు తేష్మితను స్కూల్‌లోనే ఉంచేసింది. గాయానికి పసుపురాసి రక్తం మరకలైన చొక్కాను శుభ్రం చేసింది. అనంతరం చిన్నారిని ఇంటికి పంపింది. చెవి దగ్గర గాయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు తేష్మితను ప్రశ్నించగా జరిగిన విషయం చెప్పింది. శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి టీచరు గాయత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వరల్డ్ స్కేట్ పసిఫిక్ పోటీలకు చైత్రదీపిక



స్కేటర్ పి.చైత్రదీపికతో ఆస్ట్రేలియా హైకమిషన్ సభ్యులు

కృష్ణలంక, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రోలర్ స్కేటర్ పి.చైత్ర దీపిక ఆస్ట్రేలియాలో జరగనున్న వరల్డ్ స్కేట్ పసిఫిక్-2025లో పాల్గొంటున్నారు. ఈ పోటీలు ఆగస్టు28 నుంచి 31 వరకు క్వీన్స్‌ల్యాండ్‌లోని మౌంట్ వారెన్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో ఆస్ట్రేలియన్ హై కమిషన్ అధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఆస్ట్రేలియా హైకమిషనర్ విక్ సింగ్, సంగీత కృష్ణమూర్తి (సీనియర్ డైరెక్టర్), రామకృష్ణ దస్త్రాల (డైరెక్టర్, ఆస్ట్రేలియన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్) భారత స్కేటర్లను అభినందించారు. ఆత్మీయ స్వాగతం, ప్రేరణాత్మక సందేశాలు భారత స్కేటర్లలో ఉత్సాహాన్ని నింపాయి. ఈ సమావేశంలో చైత్ర దీపికతో పాటు అర్జున అవార్డు గ్రహీత అనూప్‌కుమార్ యామా, వడ్లాని హృతిక్ పాల్గొన్నారు. అనూప్ కుమార్ యామా 1999లో బ్రిస్బేన్ గోల్డ్‌కోస్ట్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్ షిప్ ద్వారా ఆస్ట్రేలియాలో తన తొలి అంతర్జాతీయ పోటీకి హాజరైన అనుభవాన్ని గుర్తుచేసుకొన్నారు. విజయవాడ ఎస్ఎస్ఎం స్కూల్లో 10వ తరగతి చదువుతున్న చైత్ర దీపిక అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం గర్వకారణంగా నిలిచింది.



కలెక్టరేట్‌లోని ఇగ్నైట్‌సెల్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ



బిషప్ అజరయ్య పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్



రాజధాని రైతుల అర్జీలు స్వీకరిస్తున్న ప్రవీణ్‌చంద్

టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలి

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్‌లో పర్యాటక శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రాచుర్యం పొందిన కొండపల్లి ఖిల్లా, భవానీద్వీపం, గాంధీ హిల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం, మొగల్రాజపురం గుహలు, మూలపాడు బటర్ ఫ్లై పార్కు వంటి పర్యాటక ప్రాంతాలతో పాటు కనకదుర్గమ్మ దేవాలయం, గుణదల మేరీమాత, పెనుగంచిప్రోలు తిరుపతమ్మ, వేదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, జగ్గయ్యపేట సమీపంలోని తిరుమలగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం వంటి అనేక ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలను పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర రాజధానికి గేట్‌వే అయిన ఎన్టీఆర్ జిల్లాలో పర్యాటకులు, సందర్శకుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోందన్నారు. ల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో పర్యాటక, సాంస్కృతిక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలను పర్యాటకులు సందర్శించేలా ప్రత్యేక టూర్ ప్యాకేజీలు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. భవానీ ద్వీపాన్ని పర్యాటకులతో పాటు నగరవాసులు సందర్శించేందుకు వీలుగా వారాంతాల్లో వినోద, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వివిధ వర్గాల్లో ప్రతిభను వెలికితీసే పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రానున్న దసరా మహోత్సవాల్లో విజయవాడ ఉత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు. విజయవాడ నగరంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందడం ద్వారా పర్యాటక హబ్‌గా మార్చేందుకు, పర్యాటక శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో కార్యాచరణను రూపొందించి ముందడుగు వేయాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా సివిల్స్ మెయిన్స్

యూపీఎస్సీ మెయిన్స్ పరీక్షల తొలిరోజు శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. రెడ్ సర్కిల్‌లోని బిషప్ అజరయ్య బాలికల కళాశాల పరీక్ష కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లతో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఐదురోజుల పాటు నిర్వహించే మెయిన్స్ పరీక్షలలో తొలి రోజు పరీక్షకు 106 మంది అభ్యర్థులకు 102 మంది హాజరయ్యారన్నారు. విభిన్న ప్రతిభావంతులు పరీక్షలు రాసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణకు 11 మంది ఇన్విజిలేటర్లు, ఇద్దరు వెన్యూ సూపర్‌వైజర్లు, ఇద్దరు అసిస్టెంట్ సూపర్‌వైజర్లను నియమించడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రంలో అన్ని మౌలిక వసతులు కల్పించామని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లతో ప్రశాంతంగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పరిశీలనలో కలెక్టర్ వెంట లైజన్ అధికారులు బి.రామకృష్ణ నాయక్, సి.లక్ష్మీ నారాయణరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ కె.సంధ్య, వైస్ ప్రిన్సిపాల్ వి.సునీత వున్నారు.

ప్రాధాన్యతాక్రమంలో రాజధాని రైతుల సమస్యల పరిష్కారం

రాజధాని రైతులు సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ అన్నారు. రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. వార్షిక కౌలు చెల్లింపు, ల్యాండ్ పూలింగ్ స్కీం, రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్, రాజధాని ప్రాంత పేదల పింఛన్ల మంజూరు, భవనాలు, లే అవుట్ అనుమతుల జారీ తదితర సమస్యల గురించి పలువురు అర్జీలను అందజేశారు. వార్షిక కౌలు సంబంధిత అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. గ్రీవెన్స్ డేలో 51 ఫిర్యాదులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. గ్రీవెన్స్ డేలో నోడల్ అధికారి పి.జయశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి.శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, కె.ఎస్.భాగ్యరేఖ, పి.పద్మావతి, ఏజీ చిన్నికృష్ణ, జి.రవీందర్, జి.భీమారావు, సీఆర్‌డీఏ సర్వే విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ జి.పాండురంగ రావు రామకృష్ణన్, ఐటీ విభాగ అదనపు డైరెక్టర్ పెద్ది అజయ్ బాబు, తహసిల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

రియల్ టైమ్ గవర్నెన్స్‌కు డేటా అప్‌లోడ్ కీలకం

రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) రూపొందించిన ఎంప్లాయీ పెర్‌ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టమ్ (ఈపీటీఎస్) పోర్టల్‌లో సమాచారాన్ని ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేయడంపై దృష్టిపెట్టాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించిరారు. ఈపీటీఎస్ పోర్టల్‌లో సమాచారం అప్‌లోడ్ ప్రగతిపై కలెక్టర్ లక్ష్మీశ సమీక్షా సమావేశం నిర్వహించారు. జీవోలు, మెమోలు, సర్క్యులర్లు, నోటిఫికేషన్లు, లెటర్స్, ప్రొసీడింగ్స్ వివిధ రూపాల్లోని సమాచారాన్నిహెచ్‌టీటీపీఎ్‌ఎ://ఈపీటీఎస్.ఏపీ.జీఓవీ.ఇన్/ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం కనిపించకూడదన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని సూచించారు. పోర్టల్‌పై అధికారులు, సిబ్బంది కూడా పూర్తిస్థాయిలో అవగాహన పెం పొందించుకోవాలన్నారు. డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ ఏవో ఎ.శ్రీనివాసరెడ్డి, కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ పి.సలీమ్, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ అధికారి రాజేష్, మినిస్టీరియల్ సెక్షన్ అధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



పళ్ల తిప్ప కొండను తవ్వేసిన అక్రమార్కులు



అక్రమంగా మట్టిని తరలించి అనధికారిక లే అవుట్‌కు వేస్తున్న రోడ్డు

కొండలు, ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు

విజయవాడ రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : రూరల్ మండలం నున్న గ్రామంలో మట్టి మాఫియా ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. అనుమతులు లేకుండా అడ్డగోలుగా తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నాయి. కొండలు, ప్రభుత్వ భూముల్లో అర్ధరాత్రిళ్ల అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఇటీవల పళ్లతిప్ప, జగనన్న కాలనీ-2 భూముల్లో ఇష్టానుసారం తవ్వకాలు జరిపిన అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి తమ జేబులు నింపుకున్నారు. గ్రామ పంచాయితీ పరిధిలో రెండు చోట్ల జరిగిన అక్రమ తవ్వకాల విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. తవ్వకాలపై రూరల్ తహసీల్దార్‌కు ఫిర్యాదులు కూడా అందాయి.

పళ్లతిప్పను తవ్వి ప్రైవేట్ వెంచర్లకు రోడ్లు

గ్రామ శివారుల్లోని పళ్లతిప్ప కొండను గత ఐదు రోజులుగా ఓ రియల్ వ్యాపారి యథేశ్చగా తవ్వేసుకుంటున్నాడు. అర్ధరాత్రి గ్రామంలో అలికిడి లేని సమయం చూసి జేసీబీల సహాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు తెలుస్తుంది. పళ్ళతిప్ప కొండను



అక్రమ తవ్వకాలతో చెరువును తలపిస్తున్న ప్రభుత్వ భూమి

తవ్విన మట్టిని గ్రామంలోని ఏఎస్ఎం కాలేజీ సమీపంలో ఉన్న తన నాన్‌లేఅవుట్ వెంచర్‌కు తరలించి రోడ్లు పోసుకుంటున్నారు. ఈ విషయమై తాహశీల్దార్‌కు గురువారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఆర్ఐ తవ్వకాలు జరిపిన ప్రాంతంతో పాటు మట్టి తరలించిన వెంచర్లను పరిశీలించారు. అయితే సదరు వ్యాపారి తాను మట్టిని మరో ప్రాంతం నుంచి తరలించానని బుకాయించినా అధికారులు అడిగిన బిల్లులు మాత్రం తీసుకురావడం లేదు.

ప్రభుత్వ భూమిని తవ్వేసిన వైసీపీ సానుభూతిపరుడు

నున్న గ్రామ పంచాయితీ పరిధిలోని సాగర్ కాలువ పక్కన ఉన్న జగనన్న కాలనీ-2 ప్రాంతంలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ప్రభుత్వ అవసరాలకు సదరు భూమిని అధికారులు వదిలిపెట్టారు.

అయితే గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరుడి కన్ను ఆ భూమిపై పడింది. అర్ధరాత్రిళ్లు ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లను ఆ ప్రాంతానికి తరలించి వారం రోజులుగా తవ్వకాలు జరుపుతున్నాడు. ఇప్పటికే ప్రభుత్వ భూమి తవ్వకాలతో చెరువును తలపిస్తుంది. భారీగా గుంటలు ఏర్పడ్డాయి.

విచారించి చర్యలు తీసుకుంటాం : ఆర్ఐ

గ్రామంలో జరుగుతున్న తవ్వకాలపై ఫిర్యాదు అందిందని, ఉన్నతాధికారులతో మాట్లాడి పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఆర్ఐ సాయి కృష్ణ తెలిపారు.

యూరియా కోసం ఎగబడిన రైతులు

పెడన రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : యూరియా సకాలంలో అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే, నందమూరు, ముచ్చర్ల పీఏసీఎస్‌లకు శుక్రవారం యూరియా రావటంతో రైతులు ఒక్కసారిగా తరలివచ్చారు. నందమూరు పీఏసీఎస్ వద్దకు 555 కట్టలు రాగా ఆరు గ్రామాల రైతుల రావటంతో తోపులాట జరిగింది. సిఐనాగేంద్రప్రసాద్ నేతృత్వంలో రైతులను అదుపుచేసి టోకెన్‌లను పంచారు. ఎకరంకు అరకట్ట, రెండెకరాలుకు అక కట్ట ఆపై ఎన్ని ఎకరాలు ఉన్నా రెండు కట్టలు అందించారు. సిఐఓ రామ్మోహన్ పర్యవేక్షించారు.

అవనిగడ్డలో..

అవనిగడ్డ రూరల్ : మండల పరిధిలోని అశ్వారావుపాలెం, వేకనూరు, అవనిగడ్డ గ్రామాల రైతులు యూరియా కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. అశ్వారావుపాలెం, అవనిగడ్డ, వేకనూరు గ్రామాల ఎరువుల షాపులకు శుక్రవారం ఏడీఏ ఎరువులు పంపగా, ఒక్కో రైతుకు రెండేసి బస్తాల చొప్పున యూరియా అందజేశారు. ఎంతో కొంత యూరియా రావడంతో రైతులకు ఉపశమనం లభించింది.

గన్నవరంలో..

గన్నవరం : యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. శుక్రవారం ఎరువుల దుకాణాలకు యూరియా రావటంతో రైతులు క్యూకట్టారు. యూరియాను అధిక ధరలకు విక్రయించకుండా వ్యవసాయ



అశ్వారావుపాలెంలో యూరియా కోసం వచ్చిన రైతులు



గన్నవరంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

శాఖ అధికారులు పర్యవేక్షించారు. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వచ్చిన యూరియా కట్టలను ఒక్కొక్కటి చొప్పున రైతులకు ఆధార్ కార్డు ఆధారంగా అందజేశారు. గన్నవరంలో వెంకటేశ్వర ఫెర్టిలైజర్ షాపుకు 18 టన్నులు, పురుషోత్తపట్నం రైతు సేవా కేంద్రానికి 12 టన్నులు చొప్పున యూరియా వచ్చింది.

ఎరువుల సరఫరాపై నిరంతర నిఘా

కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా, ఇతర ఎరువుల సరఫరాపై నిరంతర నిఘా పెట్టి పక్కదోవ పట్టేందుకు ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకొంటున్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఎరువుల సరఫరాపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు తదితరులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. వీసీకి కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. ఎరువులు అందుబాటులో వున్న నేపథ్యంలో ఎక్కడా పక్కదారి పట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. కృత్రిమ కొరత సృష్టించినా, దారి మళ్లించినా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో మాట్లాడుతూ ఎరువులకు కొరత రాకుండా ప్రభుత్వం పటిష్ట ప్రణాళికలను అమలు చేస్తోందన్నారు. ప్రత్యేక బృందాలు విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, పరిశ్రమలు, రవాణా శాఖల అధికారులతోనూ సమన్వయం చేసుకోవాలని సూచించారు. రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులు తీసుకొనేలా, నానో యూరియా, ఇతర నానో ఎరువులపైనా పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎరువులు సరఫరాపై ఫిర్యాదులు లేదా సమాచారం అందించేందుకు కలెక్టరేట్‌లో 9154970454 నెంబరుతో కంట్రోల్ రూమ్ అందుబాటులో వుందని, ఈ నెంబరును ఎరువుల దుకాణాలు, సొసైటీల వద్ద తప్పనిసరిగా ప్రదర్శించి, అవగాహన కల్పించాలన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాజా, సీఐ నాగేంద్రప్రసాద్

తాగుబోతు చేష్టలు భరించలేక...

కుమారుడిని చంపిన తండ్రి

గూడూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : తాగుబోతు చేష్టలు భరించలేక కన్న తండ్రే కొడుకును హత్య చేసిన సంఘటన గూడూరు మండలం కంకటావ గ్రామంలో జరిగింది. వీరంకి నిరంజనరావుకు సురేష్, విఘ్నేశ్వరరావు (38), కుమార్తె ఉన్నారు. పిల్లలు ముగ్గురికి పెళ్లిళ్ల కావడంతో విడిగా వుంటున్నారు. అయితే అందులో విఘ్నేశ్వరరావు, అతని భార్య కుటుంబ కలహాల కారణంగా విడాకులు తీసుకున్నట్టు సమాచారం. దాంతో విఘ్నేశ్వరరావు తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ఇటీవల తల్లి కూడా మృతి చెందింది. దాంతో ఆ ఇంట్లో విఘ్నేశ్వరరావు, తండ్రి నిరంజనరావు కలిసి ఉంటున్నారు. విఘ్నేశ్వరరావు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ప్రతి రోజూ తాగి వచ్చి తండ్రి నిరంజనరావుతో గొడవ పడుతున్నాడు. గతంలో కూడా గొడవలు జరిగాయి. ఈ నెల 9న విఘ్నేశ్వరరావు తాగి వచ్చి తండ్రిపై గొడవకు దిగి అసభ్యపదజాలంతో దూషించాడు. దీంతో తండ్రి నిరంజనరావు తలపై కొట్టగా విఘ్నేశ్వరరావు మృతి చెందాడు. మృతి చెందిన విఘ్నేశ్వరరావును తండ్రి నిరంజనరావు యూరియా సంచిలో మూటకట్టి ఇంటి సమీపంలోని పొదలో పడేశాడు. తమ్ముడు విఘ్నేశ్వరరావు కనబడకపోవడంతో అన్న సురేష్ తండ్రిని నిలదీయగా జరిగిన విషయాన్ని చెప్పాడు. దీంతో సురేష్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన బందరు డీఎస్పీ సి.హెచ్.రాజా, సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై కె.ఎన్.వి.సత్యనారాయణలు సమాచారాన్ని సేకరించారు. సెక్షన్ 103 క్లాజ్ 1, 238 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాలురను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పటమట సీఐ పవన్ కిషోర్

పటమట పోలీసుల చొరవ

● తల్లిదండ్రులకు నలుగురు బాలుర అప్పగింత

గుణదల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో చెప్పకుండా బందర్ బీచ్‌కు వెళ్లిన నలుగురు బాలుర ఆచూకీని ఫిర్యాదు వచ్చిన గంటలో గుర్తించి పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పటమటకు చెందిన బాలురు పవన్‌కుమార్, శశిధర్, నిక్కీ, కార్తీక్ గురువారం రాత్రి 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వచ్చారు. పటమటలో ఒక పార్కులో 11 గంటల వరకు అనంతరం రెండు సైకిళ్ల మీద బందరు బీచ్‌కు వెళ్లారు. బాలురు కనబడక పోవడంతో శుక్రవారం తెల్లవారు జామున నాలుగు గంటలకు తల్లిదండ్రులు పటమట పోలీసులను ఆశ్రయించారు. సెంట్రల్ ఏసీపీ దామోదర్ సూచనల మేరకు పటమట సీఐ పవన్ కిషోర్ అధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించారు. సీసీ కెమారాలను పరిశీలిస్తూ ఆటోనగర్ మీదుగా బాలురు బందరు బీచ్ వరకు వెళ్లినట్టు గుర్తించారు. శుక్రవారం ఉదయం బందరు వెళ్లి బాలురను వెంట తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. గంటల వ్యవధిలో బాలుర అచూకీ కనిపెట్టిన సిబ్బందిని సీఐ పవన్ కిషోర్ అభినందించారు.

వీఆర్వోలపై ఒత్తిడి తగదు

రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు

విజయవాడ (గాంధీనగర్), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కుల ధృవీకరణ పత్రాల విషయంలో వీఆర్వోలపై అధికారులు ఒత్తిడి చేయడం సరైందికాదని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీఆర్.రవీంద్రరాజు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సర్టిఫికెట్లు అవసరమైన వారు నేరుగా తగిన ఆధారాలతో సచివాలయాల్లో దరకాస్తు చేసుకుంటే వారందరికి వెంటనే ఇవ్వడం జరుగుతుందన్నారు. తప్పుడు సమాచారం వీఆర్వో లాగిన్‌లకు పంపించి మీరు ఏం చేస్తారో తెలియదు వెంటనే పూర్తి చేయాలని అధికారులు తీవ్రస్థాయిలో ఒత్తిడిచేస్తున్నారన్నారు. చాలా మంది తమకు వారి వివరాలను ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని తెలిపారు. ఎటువంటి వివరాలు లేకుండా సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లు చేయడం వల్ల భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు ఎదురవుతాయని వెంటనే దీనిపై పునరాలోచించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



పొదల్లో నెల రోజుల శిశువు!

అజిత్‌సింగ్ నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నిండా నెల రోజుల వయసు కూడా లేని చిన్నారిని పొదల్లో వదిలేసిన హృదయవిదారక సంఘటన న్యూరాజరాజేశ్వరిపేటలో వెలుగుచూసింది. న్యూరాజరాజేశ్వరిపేటకు వెళ్లే దారిలో వంతెనకు రెండు వైపులా ఉన్న పొదల్లో నుంచి శిశువు ఏడుపులు వినిపించాయి. సమీపంలోని షాపుల వారు వెళ్లి చూడగా మగ శిశువు కన్పించాడు. స్థానికులు శిశువును పోలీసులకు అప్పగించారు. పోలీసులు శిశువును పాత ప్రభుత్వాసుపత్రిలోని చిన్న పిల్లల విభాగంలో చేర్పించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

వ్యాపారాల నిర్వహణకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

• మునిసిపల్ కమిషనర్ మనోహర్

గుడివాడ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో వ్యాపారాలు చేస్తున్న వారు డీ అండ్ వో ట్రేడ్ లైసెన్స్‌ను తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రత్యేకంగా చేపట్టిన డ్రైవ్‌లో 15రోజుల వ్యవధిలో 300కు పైగా లైసెన్స్‌లను జారీ చేశామని ఆయన పేర్కొన్నారు. లైసెన్స్ తీసుకోని వ్యాపారులు సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, నిర్ణీత ఫీజు చెల్లించి లైసెన్స్‌లను పొందాలని కమిషనర్ సూచించారు.

ఘనంగా ‘మానవత’ ఆవిర్భావ దినోత్సవం

గుడివాడ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సంస్థ 22వ ఆవిర్భావ దినోత్సవాన్ని గుడివాడ శాఖ అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి ఆధ్వర్యంలో స్థానిక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయం నుంచి ఏరియా ప్రభుత్వాసుపత్రి వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రిలోని రోగులకు, గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. సంస్థ జిలా చైర్‌పర్సన్ దండమూడి జయలక్ష్మి, గుడివాడ కోశాధికారి అన్నపురెడ్డి గోపిరెడ్డి, చైర్మన్ వేణుగోపాలరావు, దుద్దు చిన్న, వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి నందమూరి పద్మజ, సంయుక్త కార్యదర్శి మోహనరావు, రాధాకృష్ణ, వైద్యులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యంతో మెరుగైన ఉద్యోగావకాశాలు

గుడివాడ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కఠోర శ్రమ, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలతో పాటు సాంకేతిక నైపుణ్యం పెంచుకుంటే మెరుగైన ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చునని ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఉపాధి శిక్షణ అధికారి కె.క్రాంతికుమార్ సూచించారు. శుక్రవారం అక్కినేని నాగేశ్వరరావు ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్య అనంతరం ఉద్యోగ అవకాశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్కే ప్రసాద్, కె.ఎస్.అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆటోనగర్, సాయినగర్, లక్ష్మీనగర్ కాలని, సత్యనారాయణపురం, గీతా భవనం రోడ్డు, కాకర్ల వీధి, ద్రోణాదుల వారి వీధి, గుడ్‌మెన్‌పేట, పాముల కాలనీ, యానాదుల కాలనీ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



కూచిపూడిలో వరలక్ష్మీదేవిగా బాలాత్రిపురసుందరి



వేమవరంలో కొండాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు



చినఏరుకపాడులో ప్రత్యేక అలంకరణలో అష్టలక్ష్మీ అమ్మవారు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

గుడ్లవల్లేరు/కూచిపూడి/గుడివాడ/ గుడివాడ రూరల్/పామర్రు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా దేవాలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుడ్లవల్లేరు మండలం వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సహస్రనామ కుంకమార్చనలను అర్చకుడు శివసంతోష్ శర్మ జరిపారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతులు ఇచ్చారు. కూచిపూడి గంగా బాలాత్రిపుర సుందర రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహిళలు లలితా పారాయణ చేశారు. వరలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన బాలాత్రిపుర సుందరికి అర్చక స్వాములు పెనుమూడి పూర్ణచంద్రశేఖర శర్మ, పెనుమూడి సుబ్రహ్మణ్య శాస్త్రి(బాబి), పెనుమూడి సతీష్‌శర్మ కుంకుమ పూజలు చేశారు. బంగారు పూలతో పూజలు నిర్వహించి భక్తులకు హారతులు అందించారు. గుడివాడలో గౌరీశంకరస్వామి దేవస్థానం, భీమేశ్వరస్వామి దేవస్థానం, విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో మహాలక్ష్మీ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. విశేష పుష్పాలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గుడివాడ మండలం చిన ఎరుకపాడులో అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు జరిపారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పామర్రులో పాతాళేశ్వరమ్మ, అంకమ్మతల్లి, కన్యకాపరమేశ్వరి, గంగానమ్మ, పుట్లమ్మదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి

• డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడ, అగస్టు 22(ఆంధ్రజ్యోతి): గుడివాడ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న వినాయకచవితి పందిళ్లకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని డీఎస్పీ ధీరజ్ వినీల్ సూచించారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు పబ్లిక్ ప్రదేశాల్లో విగ్రహాలను ఏర్పాటు చేస్తే అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా మైక్‌లు, డీజే బాక్సులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ శాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకుని, షార్ట్ సర్క్యూట్‌లకు తావులేకుండా చూసుకోవాలన్నారు. వివాదాలకు తావివ్వకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్సులు, మేళాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిమజ్జనం సమయంలో శాంతిభద్రలకు విఘాతం కలిగితే పూర్తి బాధ్యత కమిటీదేనని స్పష్టం చేశారు. ఇతర మతాల వారికి, ప్రార్థనా మందిరాలకు ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని సూచించారు. సీఐలు కొండపల్లి శ్రీనివాస్, హనీష్, ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్సై పూడి నాగరాజు, తాలుకా ఎస్సై ఎన్.చంటిబాబు పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరిగితే కమిటీలదే బాధ్యత

పెదపారుపూడి: మండలంలో వినాయక చవితి పందిళ్లకు పోలీసు శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని ఎస్సై ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నవరాత్రుల్లో అవాంఛనీయ సంఘటనలు జరిగితే పూర్తి బాధ్యత కమిటీ సభ్యులదే అన్నారు. సొంత స్థలాల్లో గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేస్తే స్థలం యజమాని అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డిజేలకు అనుమతి లేదని, రాత్రి 8 గంటల తర్వాత కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు.

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

గుడివాడ: గణేష్ ఉత్సవాల జరుగనున్న నేపథ్యంలో గ్రామాల్లో మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చంటిబాబు సూచించారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో అవాంఛనీయ ఘటనల ముందస్తు సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

కూచిపూడి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తెలిపారు. మొవ్వ వేణుగోపాలస్వామి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పీఏసీఎస్ చైర్మన్‌గా మండవ రత్నగిరిరావు, సభ్యులుగా ఈడే శ్రీనివాసరావు, కాటూరి బాబూరావు ప్రమాణస్వీకారం చేశారు. త్రిసభ్య కమిటీలు రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాలని, ఎరువులు, పంట రుణాలు సకాలంలో అందించాలని ఎమెల్యే సూచించారు. పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి తులసీ దాస్, కూటమి నేతలు, రైతులు పాల్గొన్నారు.



మొవ్వలో పీఏసీఎస్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల

బాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పెదపారుపూడి: జమీదింటకుర్రులో శుక్రవారం బాలమ్మ గుడి ప్రారంభోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కుమార్‌రాజా పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, మాజీ సర్పంచ్ జాస్తి రామచంద్రరావు, నూతక్కి విశ్వేశ్వరరావు, నూతక్కి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

• ఏడీఏ శ్యామల హెచ్చరిక



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్యామల

కూచిపూడి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణదారులు ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మొవ్వ సబ్ డివిజన్ ఏడీఏ శ్యామల హెచ్చరించారు. కూచిపూడిలోని రైతు సేవా కేంద్రంలో మొవ్వ, చల్లపల్లి, ఘంటసాల మండలాలకు చెందిన ఎరువుల డీలర్లు, పీఏసీఎస్ సీఈవోలతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. యూరియా, డీఏపీ ఎరువులను రైతులకు సక్రమంగా అందించాలని సూచించారు. యూరియా ఎకరాకు అరకట్ట చొప్పున పంపిణీ చేయాలన్నారు. నానో డీఏపీ, నానో యూరియా వాడకాన్ని రైతులు విరివిగా ఉపయోగించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. నోటీసు బోర్డులో ఎరువుల నిల్వలు, ధరల వివరాలు పొందుపర్చాలన్నారు. ఏవోలు సురేష్‌బాబు నాయక్, రామ్మోహన్, కె.మురళీకృష్ణ, మూడు మండలాలకు చెందిన ఎరువుల డీలర్లు, సీఈవోలు పాల్గొన్నారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ

గుడివాడ రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని పాడిరైతులకు మోటూరు పీఏసీఎస్ చైర్మన్ చీకటి శేషగిరి సూచించారు. శుక్రవారం మోటూరు పశు వైద్యశాలలో ఎస్సీ లబ్ధిదారులకు పశుదాణా బ్యాగులను ఆయన పంపిణీ చేశారు. ప్రభుత్వం ఎస్సీలకు 220 బ్యాగుల పశువుల దాణా పంపిందని, 50 కేజీల చొప్పున అందజేశామని ఆయన తెలిపారు. బ్యాగు ఖరీదు రూ.1110 అని, 50 శాతం సబ్సిడీ పోనూ రూ.555కు రైతులకు అందించామని తెలిపారు. మండల పశువైద్యాధికారి ఉన్నం హనుమంతరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పశువుల దాణా పంపిణీ చేస్తున్న మోటూరు పీఏసీఎస్ చైర్మన్ చీకటి శేషగిరి



గుడివాడ రైతుబజారులో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన

గుడివాడ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాసిక్ వాడకాన్ని మానేద్దామని వినియోగదారులకు, రైతులకు రైతుబజారు ఎస్టేట్ అధికారి అమీర్‌బాబు పిలుపునిచ్చారు. గుడివాడ రైతుబజారులో రైతులు, వినియోగదారులకు శుక్రవారం ప్లాస్టిక్ నిర్మూలనపై ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతుబజారు వచ్చే వినియోగదారులు తప్పనిసరిగా చేతిసంచులు తీసుకుని రావాలని ఆయన సూచించారు. రైతుబజారు సిబ్బంది పెయ్యల నాగయ్య, కె.సాంబశివరావు, తులసి, రైతులు పాల్గొన్నారు.

పామర్రు: రైతుబజారులో క్యారీబాగ్‌ల వాడకం వల్ల కలిగే అనర్థాలను దుకాణాదారులకు, వినియోదారులకు రైతుబజారు అధికారి అమీర్‌బాబు అవగాహన కల్పించారు.



బాపూజీనగర్ రహదారిపైకి చేరిన మురుగునీరు

మురుగునీటి సమస్య పరిష్కరించండి

బాపూజీనగర్ వాసుల వేడుకోలు

(ఆంధ్రజ్యోతి-గుడివాడ): పెద్ద కాలువ పొంగినప్పుడల్లా బాపూజీనగర్‌లోని డ్రెయినేజీ ద్వారా మురికినీరు ఇళ్లల్లోకి, రహదారులపైకి చేరుతోందని, ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మురుగునీరు కారణంగా పిల్లలకు విషజ్వరాలు సోకుతున్నాయని అంటున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమస్య పరిష్కారానికి కృషిచేయాలని వారు కోరుతున్నారు.



గుడివాడ టూటౌన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల నోటుపుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈవో-1 రజని

పాఠశాలల తనిఖీ

గుడివాడ రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణం, మండలంలోని పాఠశాలలను ఎంఈవో-1 రజనీ తనిఖీ చేశారు. ప్రతీ విద్యార్థికి ఉపాధ్యాయులు చదవడం, రాయటం నేర్పించాలని ఆమె సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బోధించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేత

పమిడిముక్కల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఐనంపూడిలో ఇటీవల పశువుల పాకపై పిడుగు పడి అందులో ఉన్న గేదెలు, ఎద్దు మృతిచెంది నష్టపోయిన రైతు కొల్లి శ్రీనివాసరావుకు ఉయ్యూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.10 వేల చెక్కును క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం శుక్రవారం అందజేశారు. గేదెలు, ఎద్దు మృతి చెంది రూ.లక్షలు నష్టపోయిన రైతుకు సాయం అందించామని, ఆయనను ఆదుకునేందుకు మరింతమంది ముందుకు రావాలని ఆయన సూచించారు. సయ్యద్ అనీస్, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో నిరసన ర్యాలీ చేస్తున్న ఆటో డ్రైవర్లు

‘స్త్రీ శక్తి’ అమలుతో జీవనోపాధి కోల్పోయాం

• గుడ్లవల్లేరులో ఆటో డ్రైవర్ల నిరసన

గుడ్లవల్లేరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం అమలుతో జీవనోపాధి కోల్పోయామని ఆటో డ్రైవర్లు శుక్రవారం గుడ్లవల్లేరులో నిరసన ర్యాలీ చేశారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలను అందించారు. ట్యాక్సుల భారాలు మోయలేకపోతున్నామని, ఫైనాన్స్‌లు కట్టలేకపోతున్నామని, ఆటోల మరమ్మతులతో నానా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వెహికిల్ ఫిట్‌నెస్ రెండేళ్లకు ఒకసారి చేయించాలని, ఏటీసీని గుడివాడ నుంచి దూరంగా ఉన్న మచిలీపట్నం అవతల గుండుపాలేనికి మార్చారని, ఇన్ని ఇబ్బందులు పడుతున్న తమకు స్త్రీ శక్తి పథకం అమలుతో నోటిదగ్గర కూడును తీసేసినట్టు అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్త్రీ శక్తి పథకంపై పునరాలోచించాలని తహసీల్దార్ లోకరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరికి వినతిపత్రాలను అందించారు. గుడ్లవల్లేరులోని గుడివాడ, ముదినేపల్లి, పెడన, డోకిపర్రు, జేమ్స్‌పేట ఆటో పాయింట్లకు చెందిన 100 ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఆటో వర్కర్స్ మండల యూనియన్ అధ్యక్షుడు గోట్రు కోటేశ్వరరావు, పాయింట్ల ప్రెసిడెంట్లు జోషి, రాజ్‌కుమార్, అంజిబాబు,రాజారావు,మాజీ అధ్యక్షుడు శీరం నాగ రమేష్ పాల్గొన్నారు.



గోతులు స్వచ్ఛందంగా పూడ్చివేత

పమిడిముక్కల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మేడూరు వంతెన నుంచి మధునాపురం వరకు రోడ్డుపై గుంతలు పూడ్చేందుకు ఎన్నారైలు, టీడీపీ నాయకులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి శుక్రవారం పనులు ప్రారంభించారు. మేడూరు నుంచి మధునాపురం వరకు 5 కిలోమీటర్ల మేర రోడ్డు గుంతలమయంగా ఉంది. వాహనదారులు ఇబ్బంది పడుతుండడంతో నాటక కళాపరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ రూ.2లక్షలు, ఎన్నారై మూల్పూరి వెంకట్రావు రూ.50వేలతో గుంతలు పూడ్చే పనులును ప్రారంభించారు. రాజులపాటి శ్రీనివాసరావు, సురేశ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535



పోస్టర్ ఆవిష్కరణ

పెడన, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో అక్టోబరు 6, 7 తేదీల్లో నిర్వహించే ఏపీ చేనేత కార్మిక సంఘ 11వ మహాసభల ప్రచార పోస్టర్‌ను ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ శుక్రవారం పట్టణంలో ఆవిష్కరించారు. చేనేత పరిశ్రమ సమస్యల పరిష్కారానికి మహాసభల్లో కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. గోరు రా జు, వాసా గంగాధరరావు, పి.నరసింహారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చల్లపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పురిటిగడ్డ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని సబ్‌డివిజన్ డీఈ పులి శివనాగేశ్వరరావు తెలిపారు. విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సమగ్ర ఆస్తి ధ్రువీకరణ

అందించడమే స్వామిత్వ లక్ష్యం



నేలకొండపల్లిలో స్వామిత్వ రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ

పెడన రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర ఆస్తి ధ్రువీకరణ అందించడమే స్వామిత్వ పథకం లక్ష్యమని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. శుక్రవారం జేసీ గీతాంజలి శర్మ, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్‌తో కలిసి నేలకొండపల్లి, మడక గ్రామాల్లో ఆయన పర్యటించారు. స్వామిత్వ సర్వే పురోగతిని పరిశీలించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నేలకొండపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్వే సిబ్బంది వద్ద రిజిస్టర్లు, మ్యాప్‌లను పరిశీలించారు. సర్వేలో ఇబ్బందులు ఉన్నాయా అని కలెక్టర్ అడిగారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీపీవో అరుణకుమారి, జిల్లా సర్వే శాఖ ఏడీ జోషిల, డీఎల్పీవో రజాఉల్లా, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎండీవో శివప్రసాద్, ఈవో ఆర్డీ నాగిరెడ్డి, ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాపాడుదాం



పెడనలో శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

పెడన, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందని, వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగల సమయంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులకు శాంతి కమిటీ సభ్యులు సహకరించాలని ఎస్పీ గంగాధరరావు సూచించారు. గత ఏడాది వినాయక చవితి, మిలాద్ ఉన్‌నబీ పండుగల సందర్భంగా పట్టణంలో జరిగిన అవాంఛనీయ ఘటనలు ఈ ఏడాది పునరావృతం కాకుండా ముందు జాగ్రత్తగా ఏఎంసీ సమావేశపు హాలులో బందరు డీఎస్పీ సీహెచ్ రాజా అధ్యక్షతన శాంతి కమిటీ సభ్యులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. సామాజిక మాధ్యమాల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టేవారికి కఠిన దండన తప్పదని హెచ్చరించారు. వినాయక విగ్రహాల నిమజ్జన సమయాన్ని, ఊరేగింపు రూటును అందుకు బాధ్యత వహించే కమిటీ సభ్యుల పేర్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. చవితి ఉత్సవాల్లో డీజేలను నిషేధించామన్నారు. కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్ కె.అనిల్ కుమార్, సీఐ నాగేంద్రకుమార్, ఎస్సైలు గణేష్‌కుమార్, సత్యనారాయణ, శాంతి కమిటీ సభ్యులు అయూబ్‌ఖాన్, ఖదీర్, రహమాన్ బేగ్, ఖుర్షీద్‌బేగం, యక్కల శ్యామలయ్య, కూనపరెడ్డి రంగయ్యనాయుడు, వన్నెంరెడ్డి మహంకాళరావు, కొల్లూరి చిన్నా, నాదెళ్ల కోటేశ్వరరావు, పిచ్చుక శంకర్ పాల్గొన్నారు.

సారథ్యం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసే దేవానంద్

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఏమేరకు చేరువవుతున్నాయో తెలుసుకునేందుకు సెప్టెంబరు 4న నిర్వహిస్తున్న సారథ్యం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసే దేవానంద్ పిలుపునిచ్చారు. ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన బీజేపీ జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు వల్ల ప్రజలకు సంక్షేమ పథకాలు మరింత చేరువవుతున్నాయన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల ఆర్థికంగా బలపడుతున్నారని బీజేపీ చీఫ్ అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరాం, జిల్లా ఇన్‌చార్జి కపర్తి, మాజీ అధ్యక్షుడు రాజబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పంతం గజేంద్ర, మట్టా ప్రసాద్ పాల్గొన్నారు.

సేవా దృక్పథం పెంపొందించుకోండి

● విద్యార్థులతో సమగ్రశిక్ష ఏపీసీ కుముదినిసింగ్



బహుమతులు అందజేస్తున్న సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కుముదిని సింగ్

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాల్యం నుంచి సేవా దృక్పథం పెంపొందించుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కుముదిని సింగ్ సూచించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లో శుక్రవారం బహుమతులు అందజేశారు. వ్యాధి బారినపడిన ఒక విద్యార్థినికి రూ.10వేలు సాయాన్ని కుముదిని సింగ్ చేతుల మీదుగా అందజేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా విద్యానిధి కన్వీనర్ పి.శ్రీరామ్, మానవత మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు జి.కిషోర్‌కుమార్, సంస్థ కార్యదర్శి హసీంబేగ్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సూర్యావతి, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత



విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న కమిషనర్ చంద్రశేఖరరెడ్డి

పెడన, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని విశ్వభారతి హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మునిసిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి విచ్చేశారు. 25 మంది విద్యార్థులకు యూనిఫాం, పక్షవాతంతో బాధపడుతున్న పేద చేనేత కార్మికుడు చిరంజీవికి రూ.6వేల నగదు, రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలను కమిషనర్ చేతుల మీదుగా అందజేశారు. పేరిశెట్టి నాగరవి, అనుమకొండ గౌరీప్రసాద్, మట్టా రాధాకృష్ణమూర్తి, కె. దిలీప్‌కుమార్, కె. ప్రభాకర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

ఘంటసాల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలు అందించాలని కొడాలి పీఏసీఎస్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన చినకళ్లేపల్లి గ్రామానికి చెందిన వేములపల్లి సూర్య ప్రకాశరావుకు సంఘ సంస్కర్త గుత్తికొండ కోకిలాంబ సూచించారు. శుక్రవారం సూర్య ప్రకాశరావును ఆమె సత్కరించారు. వేములపల్లి మేరీ రత్నకుమారి, బంద్రపల్లి దుర్గ, గురువిందపల్లి మార్తమ్మ, బంద్రపల్లి పండు, బంద్రపల్లి ఏసుపాదం, కనుమూరి నాంచారయ్య, కనుమూరి వినయ్‌బాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు







లక్ష్మీపురం నాంచారమ్మ ఆలయం, కప్పలదొడ్డి శివాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు, గాజుల అలంకరణలో కోడూరు కనకదుర్గమ్మ

చల్లపల్లి/గూడూరు/కోడూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలను భక్తులు నిర్వహించారు. లక్ష్మీపురంలోని బాలాత్రిపురసుందరీ సహిత లక్ష్మీనాంచారమ్మ ఆలయంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు స్వర్ణ శివ సుబ్రహ్మణ్యం మహిళలతో వ్రతాలు చేయించారు. ఆలయ కమిటీ పెద్ద దాలిపర్తి నారాయణరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గూడూరు మండలం కప్పలదొడ్డి శివాల యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమారాధన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కోడూరు కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చనలు



రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న భక్తులు

మచిలీపట్నం టౌన్: నగరంలోని ప్రధాన దేవాలయాల్లో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో 1000 మంది మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఆలయ ఈవో సమ్మెట ఆంజనేయస్వామి, ఆలయ మాజీ చైర్మన్ దేసు సుబ్రహ్మణ్యేశ్వరరావు పర్యవేక్షించారు. బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ఈవో జి.వెంకట కృష్ణారావు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ముత్తేవి శశికాంత్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కరకట్టను ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించండి

● అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశం



ఉత్తర చిరువోలులంక వద్ద అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మోపిదేవి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ వద్ద నుంచి ఐదు లక్షల క్యూసెక్కులకు తగ్గకుండా వరద వస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కరకట్టను ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఉత్తర చిరువోలులంకలో అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ డీఈఈ గణేష్, టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, జనసేన మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, బాదర్ల లోలాక్షు నాయుడు, కోసూరు శివాజీ, మెరకనపల్లి నరేష్, కృష్ణాంజనేయులు, కూరేటి రాఘవ పాల్గొన్నారు.

నదికి ఇవతలి వైపే పాత ఎడ్లంకవాసుల వాహనాలు



అవనిగడ్డ రూరల్: ఆరు రోజులుగా గ్రామాన్ని వరద చుట్టుముట్టడంతో కృష్ణానదికి ఇవతలి వైపున పాత ఎడ్లంక గ్రామస్థులు ద్విచక్ర వాహనాలు నిలిపివేయాల్సి వచ్చింది. బైక్‌లను ఇవతల వైపున ఉంచి నది దాటి పడవలపై అవతల వైపునకు వెళుతున్నారు. గత ఏడాది కృష్ణానదికి వరదలు వచ్చిన సమయంలో ఇవతలి వైపున ఉంచిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు.

అర్హులైన ఏ ఒక్కరి పింఛనూ రద్దు కాదు

● టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు భరోసా

అవనిగడ్డ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లను పెద్ద సంఖ్యలో తొలగిస్తున్నారంటూ రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ చేపట్టిన ప్రచారంలో వాస్తవం లేదని, అర్హులైన ఏ ఒక్కరి పింఛనూ రద్దు కాదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో అడ్డదారిలో సదరన్ సర్టిఫికెట్ తీసుకుని పింఛన్ పొందుతున్న అనర్హుల పింఛన్లే రద్దు అవుతాయని తెలిపారు. ఇటీవల చేసిన సర్వేలో పూర్తి ఆరోగ్యవంతులుగా ఉండి, వైకల్యం లేకుండా కొందరు పింఛన్ పొందుతున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైందని, దీనిని మళ్లీ ధ్రువీకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక వైద్యబృందాలను నియమించిందని తెలిపారు. అర్హులైన ఏ దివ్యాంగుడికీ పింఛన్ రద్దు కాదని, సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారని, అర్హత ఉండీ పొరపాటున పింఛన్ కోల్పోతే ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కార్యాలయం గానీ, టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలోగానీ తెలియజేస్తే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించండి

● ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రతినిధి సదరుద్దీన్ ఖురేషి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తొలగించిన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రతినిధి సదరుద్దీన్ ఖురేషి డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలో ఉన్న కూటమి నాయకులు దివ్యాంగుల పింఛన్లను రద్దు చేయకుండా పునరుద్ధరించాలని ఆయన కోరారు. పింఛన్లు అందకపోతే దివ్యాంగులు ఆర్థికంగా కుంగిపోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుక



మోపిదేవిలో చిరంజీవి పేరిట నిర్వహించిన ఆయుష్ హోమంలో పూర్ణాహుతి గావిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మోపిదేవి/అవనిగడ్డ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శుక్రవారం మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు జనసేన పార్టీ, చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. మోపిదేవిలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు, వేద పండితులు స్వాగతం పలికారు. నాగపుట్టలో ఎమ్మెల్యే పాలు పోసి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుని చిరంజీవి పేరిట ప్రత్యేకపూజలు చేశారు. టీటీడీ కల్యాణ మండలంలో మండల చిరంజీవి యువత ఆధ్వర్యంలో చిరంజీవి పేరిట లోక కల్యాణార్థం నిర్వహించిన ఆయుష్ హోమంలో పూర్ణాహుతి గావించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అవనిగడ్డలో వెంకటేశ్వర థియేటర్ వద్ద చిరంజీవి యువత జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పికట్ల తారక మస్తాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్ర మాల్లో పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, నాయకులు పూషపు రత్నగోపాల్, చోడగం విమల్ కృష్ణ, మర్రె గంగయ్య, రాజనాల వీరబాబు, సనకా ప్రశాంత్, గుడివాక శివరావు, సిద్ధినేని అశోచ్ నాయుడు, బాదర్ల లోలాక్షు నాయుడు, మెరకనపల్లి నరేష్, కోసూరు నాగమల్లేశ్వరరావు, మత్తి వంశీకృష్ణ, జరుగు ఆదినారాయణ, కొండవీటి శ్రీనివాస్, కనగాల వెంకటేశ్వరరావు, బొప్పన భాను పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం



అధికార భాషా సంఘానికి మండలి వెంకటకృష్ణారావు పేరు పెట్టినందుకు కృతజ్ఞతగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

నాగాయలంక, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అధికార భాషా సంఘానికి దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు పేరును ప్రభుత్వం పెట్టడంపై కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలి వెంకట కృష్ణారావు శతజయంతి కార్యక్రమంలో భాగంగా 19వ రోజు మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు వారు పాలాభిషేకం చేశారు. తలశిల స్వర్ణలత, మెండు లక్ష్మణరావు, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు, మండలి ఉదయభాస్కర్, అంబటి శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శన

ఘంటసాల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఘంటసాలపాలెం గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు ఉప్పల ప్రసాదరావుకు అందించిన చిరు సంచుల వరి రకాలపై కేవీకే శాస్త్రవేత్తల బృందం శుక్రవారం క్షేత్ర సందర్శన చేసింది. జిల్లా పరిధిలోని పంట భూముల్లో ఎంటీయూ 1447, ఆర్జీఎల్ 7034, ఆర్జీఎల్ 7039 రకాల అనుకూలతలను పరిశీలించుటకు అనుభవజ్ఞులైన కొంతమంది రైతులకు చిరు సంచుల ద్వారా ఇచ్చామని కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి తెలిపారు. ఉప్పల ప్రసాదరావు సాగు చేస్తున్న ఈ రకాలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం ఆ రకాల వరి ఎత్తు, పిలకల సంఖ్యను రికార్డు చేసింది.

పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బందరుకోట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు పోలీసు బందోబస్తు మధ్య యూరియాను పంపిణీ చేశారు. సహకార సంఘంలో నిర్ణీత ధరకే అమ్మడంతో రైతులు క్యూ కట్టారు. సంఘం అధ్యక్షుడు బచ్చుల శ్రీనివాసరావు, సభ్యులు బడే వెంకటరమణ, బొడ్డు చినవెంకటస్వామి, సెక్రటరీ సుధాకర్ పాల్గొన్నారు.



బందరుకోట పీఏసీఎస్ వద్ద పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేస్తున్న సిబ్బంది



మలబార్ గోల్డ్ అందించిన చెక్కులను విద్యార్థినులకు పంపిణీ చేస్తున్న మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్

విద్యకు మలబార్ గోల్డ్ చేయూత

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదని మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. లేడీయాంప్తిల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం 45 మంది పేద విద్యార్థినులకు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ సంస్థ రూ.4 లక్షల 50 వేల ఉపకారవేతనాలు అందించింది. నగదును బాబాప్రసాద్ అందజేశారు. ప్రిన్సిపాల్ పి.లక్ష్మి, నస్పి, టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లంకిశెట్టి హరనాథబాబు, మలబార్ డైమండ్స్ మేనేజర్ ఖాశీం, మణికంఠ పాల్గొన్నారు.

ఎంఈవోల బృందం ఎయిడెడ్ పాఠశాల సందర్శన

ఘంటసాల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఘంటసాలపాలెం చాట్రగడ్డ దళితవాడలో సీబీసీఎన్‌సీ పాఠశాలను పెనమలూరు, పామర్రు, నందివాడ ఎంఈవోల త్రిసభ్య కమిటీ శుక్రవారం సందర్శించింది. పాఠశాలలో సదుపాయాలు, విద్యుత్, మంచినీటి సౌలభ్యం, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించింది. రికార్డులను పరిశీలించింది. పెనమలూరు ఎంఈవో శేషగిరిరావు, పామర్రు ఎంఈవో బి.శ్రీనివాసరావు, నందివాడ ఎంఈవో కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయుడు కె.సాల్మన్ రాజు వారికి వివరాలు తెలియజేశారు.

ఎస్టీ కుటుంబాలకు ఆధార్ కార్డులు

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపాలెం, అవనిగడ్డ-3, 5 సచివాలయాల పరిధిలోని ఎస్టీ కుటుంబాల చిన్నారులకు ఆధార్ కార్డులు అందజేసే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగి చాందినీ లత ఆధ్వర్యంలో 35 ఎస్టీ కుటుంబాలకు ఆధార్ కార్డులు ఇచ్చారు.

కొల్లూరు చిన్నాకు నెహ్రూ స్మారక అవార్డు



పెడన, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ స్మారక జాతీయ అవార్డుకు ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు, ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి చిన్నా ఎంపికయ్యారు. ఏళ్ల తరబడి ప్రజాసేవ చేస్తున్న ఆయనను విశాఖపట్నానికి చెందిన ప్రతిభ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈనెల 31న విశాఖ జిల్లా పౌర గ్రంథాలయంలో అవార్డుల ప్రదానోత్సవంలో చిన్నా ఈ అవార్డు అందుకుంటారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

చల్లపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రామానగరానికి చెందిన గొడవర్తి హేమలత అనారోగ్యంతో మృతిచెందగా పేద కుటుంబం కావడంతో అంత్యక్రియల కోసం చల్లపల్లి ఆర్యవైశ్యసంఘం, వాసవీక్లబ్ ప్రతినిధులు ఆర్థిక సహాయం అందించారు. శుక్రవారం ఆర్యవైశ్యసంఘం తరపున రూ.మూడు వేలు, వాసవీక్లబ్ తరపున రూ.7500 కుటుంబ సభ్యులకు అందించారు. ఆర్యవైశ్యసంఘం అధ్యక్ష, కార్యదర్శులు అన్నవరపు పాండురంగారావు, వరదా హరిగోపాల్, వాసవీక్లబ్ కార్యదర్శి గోళ్ల వెంకటరత్నం, మాజేటి రంగారావు, దింటకుర్తి జ్యోతి, తమ్మన సతీష్‌కుమార్‌లు పాల్గొన్నారు. నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా, అంగీకరించి హేమలత నేత్రాలను దానంచేశారు.

పీసీవోడీపై బాలికలకు అవగాహన

చల్లపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పురిటిగడ్డ జిల్లాపరిషత్ హైస్కూల్ ప్లస్‌లో బాలికలకు పీసీవోడీ సమస్యలపై ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం, కమ్యూనిటీ సైన్స్ కళాశాల, గుంటూరు లాం ఫామ్ విద్యార్థినులు శుక్రవారం అవగాహన కల్పించారు. పీసీవోడీకి కారణాలు, లక్షణాలు, ప్రభావాలు, చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరంగా తెలియజేశారు.

హైకోర్టులో ఉద్యోగాలకు ఆన్‌లైన్ పరీక్షలు

పెడన రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ హైకోర్టులో ఉద్యోగాలకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం పరీక్షల్లో 135 మందికి 88 మంది, మధ్యాహ్నం 180కి 111 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి తెలిపారు.